తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం
9 నవంబరు, 2025






# కొత్త పూలకు

# విత్తులేద్దాం..

# మరోసారి బాలయ్య జోడీగా నయనతార?



నయనతారకి తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో మంచి క్రేజ్ ఉంది. ఒక వైపున సీనియర్ హీరోల సరసన చేస్తూనే, మరో వైపు నాయిక ప్రధానమైన కథలను ఎంచుకుంటూ ముందుకు వెళుతోంది. నయనతార ఎంట్రీ ఇచ్చి ఇరవై ఏళ్లు దాటిపోయింది. అయినా ఆమెకి గల క్రేజ్, మార్కెట్ తగ్గకపోగా పెరుగుతూ ఉండటం విశేషం. ఇప్పుడు కూడా ఆమె పెద్ద బ్యానర్లలో భారీ సినిమాలతో బిజీగా ఉన్నారు. తెలుగులో ఆమె చిరంజీవి సరసన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు ఒక రేంజ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బాలకృష్ణతో నయనతార మరో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఒక టాక్ షికారు చేస్తోంది. బాలకృష్ణతో 'వీర సింహారెడ్డి' చేసిన గోపీచంద్ మలినేని, ఆయనతో ఇప్పుడు మరో సినిమా చేయడానికి సిద్ధమవుతున్నాడు. అందుకు సంబంధించిన సన్నాహాలు జరుగుతున్నాయి.

ఈ సినిమాకి సంబంధించిన కథను, చిరంజీవి సినిమా సెట్లోనే గోపీచంద్ మలినేని ఆమెకి వినిపించాడని టాక్. కథ నచ్చడంతో నయనతార ఒకే చెప్పడం జరిగిపోయిందని అంటున్నారు. అదే నిజమైతే బాలకృష్ణ సరసన ఆమెకి ఇది నాలుగో సినిమా అవుతుంది. గతంలో వీళ్ల కాంబినేషన్లో వచ్చిన 'సింహా', 'శ్రీరామరాజ్యం', 'జై' సింహా విజయాలను సాధించిన సంగతి తెలిసిందే!

# సంక్రాంతి రేసులో 'రాజాసాబ్'

'బాహుబలి', 'బాహుబలి2' చిత్రాలు సాధించిన భారీ విజయాలతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన ప్రభాస్ ఆ తరువాత ఏ సినిమా చేసినా ఇండియా లెవల్‌లో ఆ చిత్రంపై అందరి అటెన్షన్ ఉంటుంది. ఇటీవల 'కల్కి'తో మరో సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకున్న ప్రభాస్ ప్రస్తుతం 'రాజాసాబ్' చిత్రంతో పాటు 'ఫౌజీ' చిత్రాల షూటింగ్‌లతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. కాగా ఈ రెబల్‌స్టార్ పుట్టినరోజు సందర్భంగా 'రాజాసాబ్' నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేయడంతో పాటు చిత్రాన్ని జనవరి 9న సంక్రాంతి రేసులో విడుదల చేస్తున్నట్లుగా మరోసారి కన్‌ఫర్మ్ చేశారు మేకర్స్.



ఈ పోస్టర్ కలర్‌ఫుల్‌గా చూడగానే ఆకట్టుకునే విధంగా ఉంది. మేళతాళాలతో ప్రభాస్‌ను ఊరి ప్రజలు ఆహ్వానిస్తున్నట్లు ఉన్న ఈ పోస్టర్‌ను చూసి ప్రభాస్ ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. మారుతి దర్శకత్వంలో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన టీజర్‌కు కూడా మంచి రెస్పాన్స్ రావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు. హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తి చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఇక 2026 సంక్రాంతికి 'రాజాసాబ్'తో పాటు మెగాస్టార్ చిరంజీవి 'మన శంకర వరప్రసాద్ గారు', నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒకరాజు', రవితేజ 'ఆర్‌టీ 76' సినిమాలు కూడా విడుదల కాబోతున్నాయి.

ఆదివారం వార్త

9 నవంబరు, 2025

## మంచి ముత్యాలు

– మాటకేగానీ మౌనానికి సాక్షులుండరు. – ఆల్డస్ హక్స్లీ

– మాట్లాడవలసిన చోట మౌనంగా ఉండటం, మౌనంగా ఉండవలసిన చోట మాట్లాడటం.. ఈ రెండూ బలహీనతలే. – పర్షియన్ సూక్తి

## కదంబం


'సంఘీ'భావం....5

రికార్డు స్థాయిలో టోల్‌ప్లాజాల ఆదాయం

కవర్ స్టోరీ..6

కొత్త పూలకు విత్తులేద్దాం..

కథ..20

ధీర వనిత

ఆఫ్రికా వాసుల జీవన వృక్షం 'బోబాబ్' ..24

ఈ వారం కవిత్వం...27

శిశిరాలు

మళ్ళీ గ్రంథాలయోద్యమం.. 28

ఇంకా...

మొగ్గ

వారఫలం

వగైరా.. వగైరా..


# సమాచారం

## వింత గ్రామాలు



### కాంగ్‌థాంగ్

మేఘాలయలోని కాంగ్‌థాంగ్ ప్రజల్ని పిలవాలంటే విజిల్ వేయాలి లేదా కూనిరాగం తీయాలి. ఎందుకంటే ఆ గ్రామంలోని ఒక్కో వ్యక్తికి ప్రత్యేకమైన విజిల్/ కూనిరాగమో పేరుగా ఉంటుంది. అక్కడ పేర్లు పెట్టి పిలిస్తే పిల్లలకు మంచి జరగదన్న విశ్వాసంతో ఇలా కూనిరాగాలను పేర్లుగా పెడుతున్నారట. అయితే ఇలాంటి నమ్మకాలని పట్టించుకోనివారు తమ పిల్లలకు కూనిరాగాల పేర్లతో పాటు అందరు పిలవడానికి ఓ పేరు పెడుతున్నారట.

### మలానా

హిమాచల్‌ప్రదేశ్ పార్వతీ వ్యాలీలో వున్న ప్రజలు తాము అలెగ్జాండర్ వారసులమని చెప్పుకొంటారు. ప్రత్యేక భాషలో మాట్లాడుతారు. ప్రపంచానికి దూరంగా ఉండటం వల్ల వీరు తమవైన కట్టుబాట్లు, సంప్రదాయాలతో జీవిస్తున్నారు. ఈ నరగామాన్ని సందర్శించడానికి పర్యాటకుల్ని అనుమతిస్తారు. కానీ ఇక్కడికొచ్చి ఏ వస్తువునూ తాకకూడదు. అలా తాకితే వారు పూజించే 'జమ్లూ' మాయమవుతాడని స్థానికుల విశ్వాసం.

### షెట్పాల్

చాలా మంది పాముని దైవంలా కొలుస్తుంటారు. గుడికి వెళ్లి నాగదేవతను ప్రార్థిస్తారు. మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లాలో ఉన్న షెట్పాల్ గ్రామ ప్రజలు ఓ అడుగు ముందుకేసి నాగుపాములను పెంచుకుంటున్నారు. ఇంట్లో వాటి కోసం ప్రత్యేకంగా ఓ గదిని కేటాయిస్తారు. ఆ గ్రామంలోని రోడ్లపై పాములు కూడా మనుషుల్లా తిరుగుతుంటాయట.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com




## చిటికెలో..

అత్తగారు: చిటికెలో వంట చేస్తానన్నావు కదా.. ఇక్కడ కూర్చొని ఏం చేస్తున్నావు?

కోడలు: చిటికె వేయడం రావట్లేదు.. ప్రాక్టీస్ చేస్తున్నాను.

## హుండీ ఎందుకు?

భక్తుడు: గుడిలో కూడా లంచం ఉంది.

పూజారి: ఎవరు తీసుకున్నారు?

భక్తుడు: గుడిలో హుండీ పెట్టారు.. అంటే ఆరోగ్యం, ఐశ్వర్యం రావాలంటే హుండీలో డబ్బులు వెయ్యాలి అనే కదా హుండీ పెట్టారు..!



## బలి

పంతులు: తాళి కట్టే సమయంలో చేతులు అలా వణుకుతున్నాయి ఏంటి?

పెళ్లి కొడుకు: నేను తాడుతో కట్టబడి, బలికి రెడీగా ఉన్న మేకను అన్న ఫీలింగ్ కలుగుతోంది..!

## చికెన్ షాప్

టీచర్: నాకు ఈ పనే కాకుండా చికెన్ దుకాణం కూడా ఉందని నీకెలా తెలుసు?

స్టూడెంట్: మార్కులు తక్కువ వస్తే తోలు తీస్తానని అంటూ ఉంటారు కదా..!

**- ఎస్ కె.యాకూబ్ పాషా**

## నెత్తిమీద కొట్టాను

రజని: "ఏమండీ! మీకు ఎన్ని సార్లు చెప్పాను మీ పాత షర్టులు పనివాడికి ఇవ్వొద్దని.

నాని: "సరేలేవే.. ఇస్తే తప్పేంటి? ఇప్పుడు ఏం జరిగింది?"

రజని: ఇవాళ మీ షర్ట్ వేసుకుని పనికి వచ్చాడు. మీరనుకుని గట్టిగా....

నాని: ఆ... నేననుకుని గట్టిగా... ఏం చేసావు?"

రజని: "మీరనుకుని రొట్టెలకర్రతో గట్టిగా నెత్తి మీద కొట్టాను".

## జాతకంలో..

విజ్జి: "నానీ, మన వివాహం తరువాత కూడా నువ్వు నా వాడిలా ఉండాలి".

నాని: "ఎందుకు విజ్జీ అలా అంటున్నావు?"

విజ్జి: "నా జాతకం ప్రకారం మన విడాకులు రాసిపెట్టున్నాయి"

## ఒకేసారి..

ప్రదీప్: "తుపాను సహాయ నిధికి ఒక నెల జీతం ఇచ్చాను. ఆ వారంలోనే నా పెళ్లి".

రామారావు: "కష్టాలన్నీ ఒకేసారి వస్తాయంటే నమ్ముతావా?"

## హర్రర్ సినిమా

విలేకరి: "మీ సినిమా చూసి అందరు హాయిగా నవ్వుతున్నారు. మీరు నవ్వడం లేదు"

డైరెక్టర్: "ఎలా నవ్వగలను? నేను తీసింది హర్రర్ సినిమా".

**-ఈ.ఎస్.మాధవన్**

## ఏం తింటారు?

టీచర్: "రవీ, మీ నాన్న ఉదయం లేచిన వెంటనే ఏం తింటారు?"

రవి: "మా అమ్మచేత చివాట్లు".

## అమ్మగారి ఆర్డర్!

రాజకీయ నాయకుడు: "సెక్రెట్రీ, ఫోన్ ఎక్కడి నుండి?"

సెక్రెట్రీ: "అమ్మగారి దగ్గరి నుండి సార్. మీటింగ్ అయిన తరువాత ఒక జత చెప్పులు తెమ్మన్నారండీ!"

## క్షేమంగా..

కాంతారావు: "ఏం మాధవరావ్, ఎక్కడికి వెళ్తున్నావు?"

మాధవరావు: "నా దగ్గర వడ్డీకి అప్పు తీసుకున్న వీరాస్వామి హాస్పిటల్‌లో వున్నాడు. క్షేమంగా బయటకు రావాలని దేవుడికి మొక్కడానికి గుడికి వెళ్తున్నాను".

## డబ్బులు దొరకడం లేదు..

కాంతం: "వదినా, అన్నయ్యగారి చేత తాగుడు మానిపించావట కదా, వెరీ గుడ్"

సూరమ్మ: "అందుకే దిగులు"

కాంతం: "అదేంటి?"

సూరమ్మ: "ఇదివరకు డబ్బులకి లోటు ఉండేది కాదు. ఇప్పుడు అస్సలు డబ్బులు దొరకటం లేదు.

## చిరునవ్వు

చెల్లి: "అక్కా, మెడలో తాళి, కాళ్లకు మెట్టెలు వుంటే పెళ్లయిన ఆడవాళ్లు అని తెలుస్తుంది. మరి మగవాళ్లనెలా గుర్తు పట్టటం?"

అక్క: "ఎవరి ముఖంలో చిరునవ్వు కనిపించదో.. వాళ్ల పెళ్లి అయినట్లు గుర్తు".

**- వైదా ఈశ్వరరావు**



## 'సంఘీ' భావం



# రికార్డు స్థాయిలో టోల్‌ప్లాజాల ఆదాయం

జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాలు ప్రస్తుతం ఆర్థికపరమైన అంశాల్లో కీలకంగా మారాయి. గతంలో నగదును టోల్‌ప్లాజాలో చెల్లించే సమయంలో ఆయా మొత్తాలు నేరుగా ప్రభుత్వ ఖజానాకు చేరేవి కావు. అనేక ప్రాంతాల్లో టోల్‌ప్లాజాల నిర్వాహకులు వేర్వేరు అకౌంట్లు ఏర్పాటు చేసి వాటిలో నగదును జమ చేసేవారు. అయితే ఫాస్ట్‌ట్యాగ్ విధానాన్ని అమలుచేసిన తరువాత టోల్‌ప్లాజాల వద్ద వాహనదారులు చెల్లించే మొత్తం నేరుగా ప్రభుత్వ ఖజానాకు నిధులు జమ అవుతున్నాయి. దీనితో ప్రతి ఏడాది టోల్‌ప్లాజాల ఆదాయం రికార్డు స్థాయికి చేరుకుంటోంది. 2025 సంవత్సరంలో మొదటి తొమ్మిది నెలల్లో సెప్టెంబరు వరకు టోల్ ఆదాయం ఏకంగా 16 శాతం వృద్ధితో 49,193 కోట్లకు చేరింది. వాహనాల రాకపోకలు గణనీయంగా పెరగడం, నిర్ణీత కాల వ్యవధిలో టోల్ రుసుములను సవరించడమే ఈ భారీ పెరుగుదలకు ప్రధాన కారణాలని ఐసీఆర్ అనలిటిక్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. నివేదిక ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో టోల్ చెల్లించే వాహనాల సంఖ్య కూడా 12 శాతం పెరిగి 26,864 లక్షలకు చేరుకుంది. గతేడాది మొత్తం మీద ఎలక్ట్రానిక్ టోల్ వసూళ్లు 57,940 కోట్లుగా నమోదయ్యాయి. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 11 శాతం అధికం. వాహనాల సంఖ్య పరంగా చూస్తే, 2023లో 30.4 లక్షలుగా ఉన్న టోల్ లావాదేవీలు, 2024 నాటికి 32.5 లక్షలకు పెరిగాయి. వాహనాల సంఖ్య కంటే టోల్ ఆదాయం వేగంగా పెరగడానికి భారీ వాహనాల వాటా ఎక్కువగా ఉండటం, టోల్ ఛార్జీల పెంపు వంటి అంశాలు దోహదపడినట్లు ఐసీఆర్ విశ్లేషించింది. టోల్‌ప్లాజాల్లో చెల్లింపుల విషయంలో పశ్చిమ, దక్షిణ భారతానిదే సింహభాగంగా ఉంటోంది. దేశ మొత్తం టోల్ ఆదాయంలో పశ్చిమ, దక్షిణ భారతదేశంలోని కారిడార్ల వాటా సగానికి పైగా ఉండటం స్థిరంగా కొనసాగుతోంది. ఈ ఏడాది 9 నెలల కాలంలో మొత్తం వసూళ్లలో పశ్చిమ భారతదేశం సుమారు 30 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, దక్షిణాది 25 శాతంతో రెండో స్థానంలో, ఉత్తర భారతదేశం 23 శాతంతో మూడో స్థానంలో నిలిచాయి. తూర్పు, మధ్య భారతదేశం కలిపి నాలుగో వంతు వాటాను కలిగి ఉన్నాయి. ప్రాంతాలను బట్టి మారుతున్న వాహనాల తీరు. పశ్చిమ, మధ్య, తూర్పు భారతదేశంలో టోల్ చెల్లించే వాహనాల్లో 50 శాతానికి పైగా వాణిజ్య వాహనాలే (సరుకు రవాణా) ఉంటున్నాయి. ముఖ్యంగా ఒడిశా, ఏపీలోని గనులు ఓడరేవుల కారిడార్లు, ఛత్తీస్‌గఢ్‌లోని ఖనిజ ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల గుండా పారిశ్రామిక, లాజిస్టిక్స్ కార్య కలాపాలు మెరుగ్గా సాగడమే ఇందుకు కారణమని ఐసీఆర్ఏ అనలిటిక్స్ నాలెడ్జ్ సర్వీసెస్ హెడ్ మధుబని సేనుప్తా వివరించారు. దీనికి భిన్నంగా, ఉత్తర, దక్షిణ భారతదేశంలో ప్రయాణికుల వాహనాలదే ఆధిపత్యం ఇక్కడి టోల్ లావాదేవీలలో 65 నుంచి 30 శాతం కార్లు, జీపులే ఉంటున్నాయి. వ్యక్తిగత వాహనాల వినియోగం అధికంగా ఉండటం వల్ల ఈ ధోరణి కనిపిస్తోంది. కరోనా వచ్చిన తరువాత 2021 నుంచి కార్ల వినియోగం గణనీయంగా పెరిగింది. సురక్షిత ప్రయాణానికి కార్లు ఉత్తమమైనవని భావించిన మధ్య తరగతి కుటుంబాలు సైతం కార్లను కొనుగోలు చేస్తున్నాయి. ఇటీవల జీఎస్‌టిని గణనీయంగా తగ్గించడంతో కార్ల ధరలు కొంత వరకు అందుబాటులోకి వచ్చాయి. దీనితో గత నెల రోజులుగా రికార్డు స్థాయిలో వాహనాలను డెలివరీ చేస్తున్నారు. సంవత్సర కాలంలో విక్రయించే వాహనాలను కేవలం 40 రోజుల వ్యవధిలో విక్రయించినట్లు డీలర్లు ప్రకటిస్తున్నారు.

అదేవిధంగా రాజ్‌మార్గ యాత్ర యాప్‌ను తీసుకువచ్చి ప్రైవేటు కార్లకు వెసులుబాటు ఇచ్చారు. మూడు వేలు చెల్లించడం ద్వారా సం॥లో 200 టోల్‌గేట్లుగానీ, సం॥ కాలంగానీ వినియోగంలో ఉండే విధంగా రాయితీ కల్పించారు. దీనివల్ల ఒక్కొక్క టోల్‌ప్లాజాలకు కేవలం 15 రూపాయలు మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది.

త్వరలో టోల్‌ప్లాజాల స్థానంలో జీపిఎస్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి కేంద్రం సన్నాహాలు చేస్తోంది. దీనివల్ల వాహనాలు టోల్‌ప్లాజా వద్ద నెమ్మదిగా వెళ్లాల్సిన అవసరం ఉండదు. జీపిఎస్ విధానం వల్ల ఆటోమెటిక్‌గా రుసుము చెల్లింపులు జరుగుతాయి. సిబ్బందిని కేవలం పది శాతం వరకు ఉపయోగించడంతో పాటు రోడ్డుకు అడ్డుగా భారీ ప్లాజాలు నిర్మించాల్సిన అవసరం ఉండదు.

**– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ**

కవర్ స్టోరీ

# కొత్త పూలకు విత్తులేద్దాం..

చిటికెన కిరణ్ కుమార్

**ప్రతి పిల్లవాడి మనసులో ఒక చిన్న ప్రపంచం ఉంటుంది ఆ ప్రపంచంలో రంగులు, ఆశలు, ఊహలు, అభిరుచులు కలిసిపోయి సొంత ఆకాశాన్ని సృష్టిస్తాయి. కానీ మన సమాజం ఆ ఆకాశాన్ని చూసే కళ్ళు చాలా సార్లు పెద్దల తీర్పులతో మసకబారిపోతాయి. పిల్లల భవిష్యత్తును నిర్ణయించే హక్కు తల్లిదండ్రులకే ఉందనే భావన మనలో బలంగా వేరు కట్టుకుపోయింది. కానీ ఆ నిర్ణయం ఎప్పుడూ పిల్లల మనసుకు దగ్గరగా ఉండదు.**

ఒక చిన్నారి గుండెల్లో పుట్టిన కలను చంపేస్తే, ఆ జీవితం నెమ్మదిగా రంగులు కోల్పోతుంది. అందుకే పిల్లల ఇష్టమైన రంగాన్ని అర్థం చేసుకుని, దానికి రెక్కలు ఇవ్వడం తల్లిదండ్రులకూ, ఉపాధ్యాయులకూ, విద్యా వ్యవస్థకూ ఒక పవిత్ర బాధ్యతగా మారాలి.

మన పాఠశాలల్లో ఇప్పటికీ మార్కులు, మెమోలు, ర్యాంకులే భవిష్యత్తుకు మార్గదర్శకాలు అన్న భావన బలంగా ఉంది. ఎవరు మంచి మార్కులు సాధిస్తే వాళ్లే తెలివైన వాళ్లుగా, మిగతావాళ్లు వెనుకబడిన వాళ్లుగా ముద్ర వేస్తారు. కానీ ప్రపంచం చూపించిన ఉదాహరణలు చూస్తే, పెద్ద విజయాలు సాధించినవారు తరచుగా సంప్రదాయ బాటలో నడవని వారే.

ఒక సంగీతకారుడు పుస్తకాలలో కాదు, స్వరాలలో తన జీవనార్థం కనుగొన్నాడు. ఒక చిత్రకారుడు గణిత సూత్రాల్లో కాదు, రంగుల నడుమ తన ఊహలకు శిల్పం చెక్కాడు. ఒక క్రీడాకారుడు చదువు పాఠ్యపుస్తకాలలో కాదు, మైదానపు చెమటలో తన విజయ గాథను రాశాడు.

ఈ ఉదాహరణలు మనకు చెప్పేది ఒక్కటే.. పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వండి, వారు తమ పంథాను తామే ఎంచుకుంటారు.

తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు పట్ల ఆందోళన చెందడం సహజం. కానీ ఆ ఆందోళన పిల్లల కలలకు అడ్డంకిగా మారితే అది అభివృద్ధిని ఆపేసే గోడ అవుతుంది. కొందరు తల్లిదండ్రులు తమ తీరని ఆశలను పిల్లల మీద రుద్దుతారు. "మేం మా కాలంలో చేయలేకపోయినది మా పిల్లలు చేయాలి" అనే భావనతో వారిని తప్పు దారిలో నడిపిస్తారు. కానీ ప్రతి పిల్లవాడు వేరొక లోకంలో పుట్టాడు. అతని ఆసక్తులు, ప్రతిభ, మనసు, దృష్టి.. అన్నీ ప్రత్యేకం.

తల్లిదండ్రులు ఆ భిన్నతను గుర్తించి, ప్రోత్సహిస్తేనే ఆ బిడ్డ ఎదుగుతుంది. లేకపోతే ఒక పువ్వును బలవంతంగా వేరే రంగులో పూయించమని ఒత్తిడి చేసినట్టే అవుతుంది.

ఉపాధ్యాయుల పాత్ర కూడా ఈ నేపథ్యంలో అత్యంత కీలకం. విద్యార్థులు ఏ అంశంలో ప్రతిభ చూపుతారో, వారి మనసు ఏ వైపు వాలుతుందో ఉపాధ్యాయులు ముందుగా గుర్తించగలరు. పరీక్ష ఫలితాలకే పరిమితం కాకుండా, తరగతి గదిలో వారి ప్రవర్తన, ఆసక్తి, ఉత్సాహం గమనిస్తే ఆ చిన్నారి భవిష్యత్తు దారిని అంచనా వేయవచ్చు. గురువు ఒక మార్గదర్శి ఆయన పిల్లల మనసు వైపు చూసి నడిపించగలిగితే, ఆ బిడ్డ జీవితాన్ని మార్చగలడు. పరీక్షల్లో అగ్రస్థానం రావడం కంటే, జీవితంలో తృప్తి పొందడం గొప్ప విజయం అని పిల్లలకు నేర్పించే విద్యావ్యవస్థ అవసరం.

ఇప్పటి విద్యావ్యవస్థ ఎక్కువగా ఒకే రకమైన మూసకాన్ని అందరికీ పెట్టే ప్రయత్నం చేస్తోంది.



కానీ విద్య అనేది ఒకే నమూనా కట్టడంలో కాకుండా, ప్రతి వ్యక్తిలోని ప్రత్యేకతను వెలికి తీయడంలో ఉందని మనం మరిచిపోతున్నాం. పుస్తక జ్ఞానం అవసరం కానీ పుస్తకం దాటి ఉన్న ప్రపంచాన్ని చూపే విద్య మరింత అవసరం.

ఒక బిడ్డ చిత్రలేఖనంలో మునిగిపోతే, ఇంకొక బిడ్డ యంత్రాల నిర్మాణంలో మునిగిపోతాడు. మరొకరు గానంలో తన ప్రాణం పెట్టి పాడతాడు. ఈ తేడాలు లోపాలు కావు, ఇవే సృష్టి వైవిధ్యానికి ఆధారం. విద్యావ్యవస్థ ఈ వైవిధ్యాన్ని అంగీకరించి, ప్రతి రంగంలో అవకాశాలను కల్పించాలి.

మన సమాజం తరచూ 'డాక్టర్', 'ఇంజినీర్' అనే రెండు పదాలను మాత్రమే విజయానికి ప్రమాణంగా చూస్తుంది. కానీ జీవితం కేవలం ఆ రెండు వృత్తులకే పరిమితం కాదు. సమాజానికి అవసరమైనది వైవిధ్యం ఆవిష్కర్తలు, కళాకారులు, క్రీడాకారులు, రైతులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, సేవాసంస్థల్లో పని చేసేవారు... ఇలా అందరూ సమానంగా విలువైనవారు. పిల్లల కలల దిశగా వారిని ప్రోత్సహించడం ద్వారా మనం సమాజానికి సరికొత్త దిశ చూపగలుగుతాం.

పిల్లల మనసును అర్థం చేసుకోవడం ఒక కళ. వారు చెప్పని మాటలు, వారు చూపిన చిన్న ఆసక్తులు, వారు చూసే దిశలు ఇవే వారి భవిష్యత్తు సూచనలు. ఒక చిన్నారి చిత్రాన్ని చూసి, "ఇది సరిగ్గా రాలేదు" అనడం కంటే "ఇది ఆసక్తికరంగా ఉంది" అనడం వాళ్ల మనసులో నమ్మకం పెంచుతుంది. ఆ నమ్మకం జీవితంలో దిశ చూపుతుంది. పిల్లలు నమ్మకం కోల్పోతే వారు మౌనంగా మారిపోతారు; ప్రోత్సాహం పొందితే పర్వతాలను ఎక్కగలుగుతారు.

పిల్లలకు స్వేచ్ఛ అంటే అజ్ఞానం కాదు, అది బాధ్యతతో కూడిన స్వాతంత్రం. వారు చేయదలచిన పని ఏదైనా కావొచ్చు.. కానీ దానిలో పట్టుదల, నేర్పించడం, క్రమశిక్షణ పెంచడం తల్లిదండ్రులు, గురువుల చేతిలో ఉంది. కేవలం మార్గం చూపడం కాదు, ఆ మార్గంలో స్ఫూర్తిని నింపడం కూడా వారి కర్తవ్యమే. ప్రతి బిడ్డ తనలోని ప్రతిభను గుర్తించి, దానిని కృషితో సాకారం చేసుకునే స్థాయికి చేరుకోవాలి.



సమాజం మారుతున్నది, అవకాశాలు విస్తరిస్తున్నాయి. కొత్త సాంకేతికతలు, కొత్త కళారూపాలు, కొత్త వృత్తులు పుట్టుకొస్తున్నాయి. ఇలాంటి సమయంలో పిల్లల అభిరుచిని గుర్తించకపోతే మనం భవిష్యత్తు తరాలను కోల్పోతాం. కాబట్టి, పిల్లల కలలను అర్థం చేసుకుని వాటిని సాకారం చేయడానికి మార్గాలు సృష్టించాలి.

చివరగా చెప్పుకోవలసినది ఒక్కటే.. పిల్లల మనసు ఒక తోట. దానిలో ఏ పువ్వు ఎప్పుడు పూస్తుందో, ఏ రంగులో పూస్తుందో మనకు తెలియదు. మన పని ఆ తోటకు నీరు పోయడం, కాంతి ఇవ్వడం, ప్రేమతో పెంచడం. ఆ పువ్వు తన స్వంత రంగులో వికసించనివ్వాలి. అప్పుడు మాత్రమే మనం నిజమైన విద్యను అందించామనే సంతృప్తి వస్తుంది. పిల్లల కలలను అర్థం చేసుకుని వాటికి రెక్కలు ఇస్తే, ఆ రెక్కలతోనే రేపటి ఆకాశం అందంగా మిణుగుతుంది.

## ప్రపంచం పిల్లల కలలను ఎలా పెంచుతుంది?

ప్రపంచంలో ప్రతి దేశం తన సంస్కృతి, విద్యా పద్ధతి, కుటుంబ వ్యవస్థ ఆధారంగా పిల్లల ప్రతిభను పెంపొందించే మార్గాలను ఏర్పరచుకుంది. పిల్లల కలలను గౌరవించడం, వారికి నచ్చిన రంగంలో ఎదగడానికి స్వేచ్ఛ ఇవ్వడం అనే భావన ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఒక సాంస్కృతిక విలువగా మారుతోంది. మన దేశంలో ఇంకా "ఏ రంగం మంచిది?", "ఏ ఉద్యోగం స్థిరం?" అనే ఆలోచనలతో పిల్లల భవిష్యత్తు నిర్ణయాలు జరుగుతున్నప్పటికీ, చాలా దేశాలు పిల్లల మనసును అర్థం చేసుకుని, వారి కలల దిశగా మార్గాలను నిర్మిస్తున్నాయి. ఈ దిశగా కొన్ని దేశాల విధానాలు, ఆచరణలు మనకు ప్రేరణాత్మకంగా ఉంటాయి.

**ఫిన్లాండ్** అనే చిన్న దేశం ప్రపంచంలో అత్యుత్తమ విద్యావ్యవస్థ కలిగిన దేశంగా గుర్తింపు పొందింది. అక్కడి పాఠశాలల్లో పిల్లలకు పోటీ అనే భావననే చూపించరు. పరీక్షల్లో మార్కుల కంటే పిల్లల అభిరుచి, ఆలోచనా శక్తి, సమస్య పరిష్కరణ నైపుణ్యం, సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇస్తారు. ఒక చిన్నారి పాట పాడటంలో ఆసక్తి చూపిస్తే, గురువు వెంటనే ఆ ఆసక్తిని గుర్తించి దానిని అభ్యాసంగా మార్చుతాడు. ఫిన్లాండ్‌లో "ప్రతీ బిడ్డ తన గడియారం ప్రకారం నేర్చుకుంటాడు" అనే నమ్మకం ఉంది. ఈ భావన పిల్లలకు ఒత్తిడి లేని స్వేచ్ఛను ఇస్తుంది, అదే వారి జీవితాన్ని సృజనాత్మకంగా తీర్చిదిద్దుతుంది.

**జపాన్‌లో** పిల్లల పెంపకం కళగా పరిగణించబడుతుంది. అక్కడి విద్యా

వ్యవస్థ క్రమశిక్షణ, కృషి, సమూహం పట్ల బాధ్యత అనే విలువలను నేర్పుతుంది. కానీ అదే సమయంలో పిల్లల వ్యక్తిగత అభిరుచిని కూడా గుర్తిస్తుంది. జపాన్‌లో చిన్న వయసులోనే పిల్లలకు సంగీతం, చిత్రలేఖనం, క్రీడలు, సాంకేతికత వంటి ఎన్నో రంగాలలో శిక్షణ ఇస్తారు.

పాఠశాలలు వారానికి ఒక రోజు “ స్వేచ్ఛా దినం”గా ప్రకటించి, ఆ రోజు పిల్లలు తమకు నచ్చిన పనిని చేసుకునే అవకాశం కల్పిస్తాయి. కొందరు పిల్లలు రోబోట్లను తయారు చేస్తారు, ఇంకొందరు తోటలను అలంకరిస్తారు. ఈ విధానం ద్వారా పిల్లల ఆలోచనా స్వాతంత్ర్యం పెరుగుతుంది.

అమెరికా దేశంలో Career exploration programs అనే ప్రత్యేక పద్ధతులు ఉన్నాయి. అక్కడి పాఠశాలల్లో పిల్లలు చిన్న వయసులోనే వృత్తులను అనుభవించేందుకు అవకాశాలు కల్పిస్తారు. ఉదాహరణకు.. ఒక బిడ్డ శాస్త్రవేత్త కావాలనుకుంటే, అతనిని సమీపంలోని ల్యాబ్‌కి తీసుకెళ్లి అక్కడి పరిశోధనను ప్రత్యక్షంగా చూపిస్తారు. మరొక బిడ్డ సినిమాలపై ఆసక్తి చూపితే, అతనికి చిన్న చిత్ర నిర్మాణ శిక్షణ ఇస్తారు. ఇలా ప్రత్యక్ష అనుభవం ద్వారా పిల్లలు తమ ఆసక్తిని స్పష్టంగా తెలుసుకుంటారు.

అమెరికాలో తల్లిదండ్రులు పిల్లల అభిరుచిని గౌరవించడం ఒక సాంస్కృతిక ఆలవాటుగా మారింది.

**కెనడాలో** విద్యా విధానం ‘Learning through play’ అనే సిద్ధాంతంపై ఆధారపడింది. అక్కడ ఆటల ద్వారా నేర్చుకోవడమే ప్రధాన లక్ష్యం.

చిన్న పిల్లలకు పుస్తకాల కన్నా మట్టి, రంగులు, నీరు, విత్తనాలు ఇవే పాఠాలు. ఆ ఆటల్లోంచి వారు ప్రకృతిని, శాస్త్రాన్ని, గణితాన్ని సహజంగా అర్థం చేసుకుంటారు. ఇది వారికి జ్ఞానం మాత్రమే కాకుండా, పరిశీలనా శక్తి, కుతూహలం, నక్రమశిక్షణను నేర్పిస్తుంది. పిల్లల ఆసక్తిని గుర్తించి దానిని మార్గనిర్దేశం చేసే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

**జర్మనీ** దేశం వృత్తి ఆధారిత విద్యకు ప్రసిద్ధి. అక్కడి పిల్లలు పాఠశాల చదువుతో పాటు తమకు నచ్చిన వృత్తిరంగంలో శిక్షణ పొందుతారు. ఒకరు వంట నేర్చుకోవాలనుకుంటే హోటల్‌లో పని చేస్తారు. ఇంకొకరు ఇంజినీరింగ్‌లో ఆసక్తి చూపితే చిన్న వర్క్ షాప్‌లో అనుభవం సంపాదిస్తారు.



ప్రభుత్వం ఈ శిక్షణకు వేతనం కూడా ఇస్తుంది. ఈ విధానం వల్ల జర్మనీలో ప్రతి యువకుడు తన ఇష్టమైన రంగంలోనే ఎదగగలుగుతున్నాడు.

**ఇండోనేషియా, సింగపూర్** లాంటి దేశాలు కూడా సృజనాత్మకతకు ప్రధాన ప్రాధాన్యం ఇస్తున్నాయి. అక్కడి పాఠశాలలో ప్రతి విద్యార్థి సంవత్సరం చివర్లో ‘ఆసక్తి ప్రదర్శన’ (ఇంటరెస్ట్ ఎగ్జిబిషన్) నిర్వహిస్తారు. పిల్లలు తమకు నచ్చిన రంగంలో చేసిన ప్రాజెక్టులను, కళాప్రదర్శనలను చూపిస్తారు. ఇది వారికి గౌరవాన్ని, సంతృప్తిని ఇస్తుంది.

తల్లిదండ్రులు కూడా ఆ ప్రదర్శనలో పాల్గొని తమ పిల్లల ప్రతిభను ప్రత్యక్షంగా చూస్తారు.

**న్యూజిలాండ్‌లో** ‘Child centered learning’ అనే పద్ధతి అమలులో ఉంది. ప్రతి విద్యార్థి పాఠ్య ప్రణాళికలో మార్పులు కోరవచ్చు. ఉపాధ్యాయులు వారికి అనుకూలంగా పాఠాలు రూపొందిస్తారు.

ఒక బిడ్డ ప్రకృతిలో ఆసక్తి చూపిస్తే, తరగతి బయట ఫీల్డ్ ట్రిప్‌లు ఏర్పాటు చేస్తారు. మరొకరు సాంకేతికతలో ఆసక్తి చూపిస్తే, రోబోటిక్స్ క్లాస్‌లు అందిస్తారు. ఈ విధంగా పిల్లలే తమ విద్యా ప్రయాణానికి భాగస్వాములవుతారు.

**భారతదేశం** కూడా నెమ్మదిగా ఈ దిశగా కదులుతోంది. నూతన విద్యా విధానం (ఎన్ఇపి) 2020లో “కళా–శాస్త్ర సమన్వయం” అనే భావనను ప్రవేశపెట్టింది. విద్యార్థులు తమ ఇష్టమైన సబ్జెక్టులను ఎంచుకోవడానికి స్వేచ్ఛ పొందుతున్నారు. కానీ ఈ మార్పు వాస్తవంగా ఫలించాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు అందరూ పిల్లల మనసును అర్థం చేసుకోవాలి. పిల్లల కలలను కాపాడటమే వారి భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుంది.

ప్రపంచంలోని ఈ ఉదాహరణలు మనకు ఒక పెద్ద సందేశం ఇస్తాయి. పిల్లల మనసు బలవంతం ద్వారా కాదు, ప్రోత్సాహం ద్వారా వికసిస్తుంది. వారు ఎంచుకున్న దారిని నమ్మి, దానిలోనే గొప్పతనాన్ని కనుగొనడానికి సహాయం చేయాలి. ప్రతి పిల్లవాడు ఒక విత్తనం. దానికి సరైన నేల, నీరు, వెలుతురు అందిస్తే అది ఏ చెట్టుగా పెరుగుతుందో మనం ఊహించలేం. కానీ అది పూస్తుందన్న నమ్మకం మనలో ఉండాలి. ఈ విశ్వాసమే ఒక దేశాన్ని సృజనాత్మకతలో ముందుకు నడిపిస్తుంది. పిల్లల కలలను

గౌరవించడం, వారికి ఆత్మవిశ్వాసం నింపడం, ప్రతి రంగాన్ని సమానంగా విలువ చేయడం.. ఇవే రేపటి సమాజానికి బలమైన మూలాలు. ప్రపంచం ఈ పాఠాన్ని నేర్చుకుంది. ఇప్పుడు మనమూ నేర్చుకోవాల్సిన సమయం వచ్చింది.

## పిల్లల కలల దిశలో సమాజం నడవాలి

పిల్లల కలలను అర్థం చేసుకోవడం ఒక కుటుంబానికి మాత్రమే కాదు, మొత్తం సమాజానికి బాధ్యత. ఒక చిన్నారి ఆసక్తి అతని భవిష్యత్తు శకలం దాన్ని గమనించి తీర్చిదిద్దే దిశగా మన దృష్టి నిలవాలి. ప్రపంచంలోని అనేక దేశాలు ఇప్పటికే ఈ మార్పు వైపు పయనిస్తున్నాయి. అక్కడ పిల్లల అభిరుచిని పరీక్షలతో కొలవరు, మార్కుల తూకంలో తూచరు. కానీ మన దగ్గర ఇప్పటికీ మార్కులు, మెమోలు, ర్యాంకులు అనే త్రిముఖ ధోరణే విద్యకు ప్రమాణంగా ఉంది. ఈ ధోరణి మారకపోతే ప్రతిభ విత్తనాలు మొలకెత్తకముందే వాడిపోతాయి.

ప్రతీ బిడ్డలో ఒక కళాకారుడు, శాస్త్రవేత్త, క్రీడాకారుడు, నాయకుడు దాగి ఉంటాడు. ఆ ప్రతిభను వెలికితీయడమే మన విద్యావ్యవస్థ నిజమైన విజయం. ప్రతి తల్లిదండ్రి తన పిల్లలోని ఆ లోపలి కాంతిని గుర్తించాలి.

“ఇతరుల పిల్లలు ఏం చేస్తున్నారు?” అనే పోలికలు పిల్లల మనసును బంధిస్తాయి. వారిని ఇతరుల కొలమానంతో కాకుండా, వారి సొంత పంథాతో అంచనా వేయడం మన మొదటి మార్పు కావాలి.

విద్య అంటే కేవలం పాఠ్యాంశం కాదు, అది జీవన పాఠం. ఒక పిల్లవాడు పుస్తకంలో కాకుండా తోటలో నేర్చుకోవచ్చు, ఇంకొకడు ప్రయోగశాలలో కాకుండా సంగీతంలో తన ప్రపంచాన్ని కనుగొనవచ్చు. ఈ వైవిధ్యమే మానవతా సౌందర్యం. పిల్లలు ఎంచుకున్న మార్గం సాంప్రదాయానికి విరుద్ధమైందని కాదు; అది భవిష్యత్తుకు దారి చూపే కొత్త దారిగా చూడాలి.

తల్లిదండ్రులు పిల్లలపై ప్రేమతో చూపే శ్రద్ధ కొన్నిసార్లు ఆ పిల్లల స్వాతంత్ర్యాన్ని అణగదొక్కుతుంది. “మేం అనుభవం ఉన్నవాళ్లం” అనే భావనతో పిల్లల ఆలోచనలను నిరక్ష్యం చేస్తే, వారు తమ కలల పట్ల భయపడటం మొదలు పెడతారు. కానీ ఒకసారి ఆ కలలు చనిపోతే, ఆ మనసు నిస్సత్తువగా మారిపోతుంది. బదులుగా, వారిని



నమ్మి ప్రోత్సహిస్తే, వారు తమ సామర్థ్యాన్ని ప్రపంచానికి నిరూపిస్తారు.

ఉపాధ్యాయులు కూడా పాఠ్యపుస్తక బంధనాలకే పరిమితం కాకుండా పిల్లల మనసును పరిశీలించాలి. ఒక విద్యార్థి ప్రశ్నించడంలో ఆసక్తి చూపితే, ఆ ప్రశ్నలకే కొత్త దారులు చూపాలి. ఒక విద్యార్థి నిశ్శబ్దంగా ఆలోచిస్తుంటే, అతనిలోని సృజనాత్మకతను వెలికి తీయాలి. గురువు ఒక్క మాట పిల్లలో విశ్వాసాన్ని కలిగిస్తే, ఆ బిడ్డ జీవితాంతం దాని వెలుగులో నడుస్తాడు.

విద్యాసంస్థలు కూడా ఈ ఆలోచనను ఆచరణలో పెట్టాలి. పరీక్షా ఫలితాల కంటే ఎక్కువగా పిల్లల సామర్థ్యాలను గుర్తించే కార్యక్రమాలు ఉండాలి. వార్షికోత్సవాల్లో టాప్‌ర్లకు బహుమతులు ఇవ్వడం మాత్రమే కాకుండా, సృజనాత్మకత, కృషి, సాంఘిక సేవ, ఆవిష్కరణ వంటి విభాగాల్లో కూడా గుర్తింపు ఇవ్వాలి. అప్పుడు విద్యార్థులు తమ ప్రతిభ పట్ల గౌరవాన్ని నేర్చుకుంటారు.

సమాజం మారాలంటే మన దృష్టి మారాలి. పిల్లల అభిరుచి ఏదైనా కావొచ్చు అది సంగీతమై ఉండొచ్చు, క్రీడలై ఉండొచ్చు, శాస్త్ర పరిశోధనై ఉండొచ్చు కానీ ఆ రంగంలో విజయానికి సమాన గౌరవం ఇవ్వడం మన సంస్కృతిలో స్థిరపడాలి. అప్పుడే నిజమైన సమానత్వం ఏర్పడుతుంది.

పిల్లలు భవిష్యత్తు కాదు.. వారు ఈ క్షణంలోనే జీవం ఉన్న సృష్టి. వారిని ప్రోత్సహించడమే రేపటి సమాజ నిర్మాణం. మనం వారికి ఇచ్చే ప్రోత్సాహం, ప్రేమ, నమ్మకం ఇవే మనం పెట్టే గొప్ప పెట్టుబడులు. ఒక చిన్నారి కల సాకారమవ్వడం అంటే ఒక కుటుంబం మాత్రమే కాదు, ఒక దేశం ముందుకు కదలడం.

కాబట్టి, ప్రతి తల్లీ, తండ్రీ, ప్రతి గురువు, ప్రతి విద్యాసంస్థ ఒక్కసారైనా తమ మనసును ప్రశ్నించాలి “మేం పిల్లల కలలను అడ్డుకుంటున్నామా, లేక వాటికి రెక్కలు ఇస్తున్నామా?” ఈ ప్రశ్నకు మనస్ఫూర్తిగా సమాధానం చెప్పగలిగితేనే మనం నిజంగా విద్యావంతులమవుతాం.

ప్రతీ పిల్లవాడు తన కలతో ఈ ప్రపంచాన్ని అందంగా మార్చగలడని నమ్మండి. ఆ నమ్మకమే మన సమాజానికి వెలుగు చూపుతుంది. మన బాధ్యత పిల్లల కలలను నడిపించడం కాదు, వాటిని ఎగరనివ్వడం. ఎందుకంటే, వారి రెక్కలతోనే రేపటి ఆకాశం రూపుదిద్దుకుంటుంది.

# యజ్ఞంలా నూలు వడికేది..

కస్తూరిబాకు గాంధీజీ కొన్ని రోజులు స్వయంగా పాఠాలు చెప్పారు. గుజరాతీ నేర్పారు, భగవద్గీత శ్లోకాలు చెప్పించారు. భూగోళం, చరిత్ర పాఠాలు చెప్పారు. మధ్యాహ్నం విశ్రాంతి తీసుకునే సమయంలోనూ ఆయన ఏదో ఒకటి చెప్పి దానికి అర్థం విడమరిచి చెప్పేవారు. ఆమె ఎంతో ఆసక్తితో చదవాలనుకున్నప్పటికీ వయస్సు పైబడుతుండటంతో చదువు సంధ్యలకు ఆమె ఆరోగ్యం సహకరించలేదు. క్రితం రోజు చెప్పిన పాఠాల లోంచి మరుసటి రోజు గాంధీ ఏవైనా ప్రశ్నలు అడిగితే ఆమె ఎప్పుడో తప్ప సరైన జవాబు చెప్పేది కాదు. గాంధీ ఆమెకు గాంధీ పంజాబ్‌లోని నదులు, ప్రాంతాలు, కొన్ని పేర్లు ఎలా నేర్పారు, గాంధీ చెప్పిన పేర్లను గుర్తు పెట్టుకోవడం కోసం కస్తూరిబా సుశీలతో వాటిని ఓ కాగితం మీద రాయించుకునేది. అనంతరం వాటిని బట్టీ పట్టడానికి ప్రయత్నించేది. కానీ మరుసటి రోజు గాంధీ చెప్పమంటే ఆమెకేదీ గుర్తుకు వచ్చేది కాదు.

గాంధీజీ ఆమెకు అక్షాంశం, రేఖాంశం అంటే ఏమిటో చెప్పారు. ప్రతీరోజూ మధ్యాహ్నం భోజనం తర్వాత ఆయన ఓ కమలాపండు తీసుకుని దాని మీద అక్షాంశం, రేఖాంశం, భూమధ్యరేఖ తదితరాలన్నీ వివరిస్తూ ఉండేవారు. గాంధీజీ గుజరాతీ అయిదో గ్రేడ్ పాఠ్యపుస్తకంలోని పాఠాలు, పద్యాలు కూడా నేర్పించారు. పాటలు ఏ రాగంలో కూడా అందులో ఉండేది. ప్రతిరోజూ రెండు పాటలు నేర్పేవారు.

ఆయన ఎంత పట్టుబట్టినా ఆమెకు చదువు మీద ఉన్న ఆసక్తి నెమ్మదిగా తగ్గుతూ వచ్చింది. అందుకు ప్రధాన కారణాలు అనారోగ్యం, వయస్సు మీద పడటం. ఆమె ఎక్కువగా భగవద్గీత చదువుతుండేది. మధ్యాహ్నంపూట ఆమె గాంధీతో కలిసి గీతా పారాయణ చేసేది. భోజనం చేసిన తర్వాత గాంధీజీ ఓ కునుకు తీసేవారు. కాస్సేపు ఆయన పాదాలు ఒత్తేది. బాపూకి నిద్రపట్టినట్టు తెలిసిన తర్వాత ఆమె తన కుటీరానికి వచ్చి విశ్రాంతి తీసుకునేది. సాయంత్రం ప్రార్థన తర్వాత రాత్రి పూట సుశీలతోనూ



కలిసి గీతాపారాయణ చేసేది.

## షికారు

మహదేవ్‌బాయి మరణం తర్వాత కస్తూరిబా గాంధీతో కలిసి ఉదయం, సాయంత్రం షికారు వెళ్తుండేది. ఆయన ఆమె భుజాలమీద వాలి మెల్లగా నడిచేవారు. అలా నెల రోజులు గడిచాయి. అయితే ఆ తర్వాత ఆమె నడవలేకపోయేది. ఛాతీలో నొప్పి రావడంతో షికారుకెళ్ళడం మానేసింది. కాస్త పరవాలేదనుకుంటే వరండాలోనే నడిచేది. కాస్సేపు నడిచిన తర్వాత అక్కడే ఉన్న కుర్చీలో కూర్చుని ఆవరణలోనే గాంధీ పచార్లు చేస్తుంటే చూస్తూ ఉండేది. అలాగే కుర్చీలోనే ఉంటూ ఆశ్రమ భజనావళి లేదా మరేదైనా చదివేది.

కస్తూరిబా తరచూ వార్తాపత్రికలు కూడా చదువుతుండేది. ఆమె ఏది చదివినా బయటకు వినిపించేలా పెద్ద గొంతేసుకుని చదివేది.

## నూలు వడకడం

ఆమెకు రాట్నం మీద వందల గజాల దారాలు వడికేది. ఆమె ఆరోగ్యం సరిగ్గా లేకున్నా సరే నూలు వడికే పని మానేదికాదు. ఒకరోజు ఆమె నూలు వడక్కుండా ఉన్నప్పుడు ఎవరైనా చూసి "ఆరోగ్యం బాగులేదా?" అని అడిగితే అవునని ఓ చిన్న నవ్వు నవ్వేది. గాంధీజీకి నేను ఏ విధంగా ఉపయోగపడగలను? నాకేమో చదువు రాదు. కనుక ఆయనకు చదువులోగానీ రాతలోగానీ ఉపయోగపడలేను. రాజకీయాలేమో తెలియవు. కనుక అందరినీ నూలు వడకాలని చెప్పేవారు. నూలుదారంతోనూ స్వరాజ్యం పోరాటంలో ఓ మేరకు తోడ్పడవచ్చని అనుకుని నూలు వడకడం ఓ యజ్ఞంలా చేస్తున్నానని చెప్పేది.

కస్తూరిబాలో దైవభక్తి ఎక్కువే. ఏకాదశి, పౌర్ణమి, అమావాస్య, శివరాత్రి తదితర రోజుల్లో ఆమె ఉపవాసం ఉండేది.

జైల్లో ఉన్న రోజుల్లోనూ ఆమె రామాయణం, భాగవతం చదువుతుండేది. ఆగాఖాన్ ప్యాలెస్‌లో సాయంత్రం ప్రార్థనల్లో ఆమె తులసీ రామాయణంలోంచి కొన్ని ఘట్టాలు చదివేది. ఆమె రామాయణాన్ని అర్థాలతో సహా విపులంగా చదివేది. శ్లోకాలకు హిందీలో భావం ఉండేది. అయితే ఆమెకు హిందీ అంతగా రాకపోవడం వల్ల గాంధీ ఆమెకు గుజరాతీలో చాలా సార్లు వివరంగా చెప్పేవారు. మీరాబెన్ గదిలో ఓ బాలకృష్ణుడి బొమ్మ ఉండేది. ఆ బొమ్మను ఆమె బల్ల మీద పెట్టి చుట్టూ పువ్వులు పేర్చేది. ఆ బొమ్మకు కూడా కస్తూరిబా రోజూ ఆరాధించేది.

– యామిజాల జగదీశ్

సింగిల్ పేజీ కథ

# పెంపకం

పగలంతా మెకానిక్ షాప్‌లో బోల్డంత పని చేసి, సాయంత్రం ఇంటికి వచ్చేసరికి అతని చేతులపై నూనె మరకలు, చెమటతో తడిసిన చొక్కా దర్శనమిస్తాయి. కానీ ఆయన ముఖంలో మాత్రం ఏదో తెలియని సంతోషం. ఎందుకంటే అతను చేసిన ప్రతీ కష్టం తన కొడుకు కిరణ్ కోసం. కిరణ్ పెద్దవాడై, మంచి ఉద్యోగం సంపాదించి, వాడి కాళ్ళ మీద వాడు నిలబడి, తాము సమాజంలో గర్వపడే రోజు వస్తుందని కలలు కంటున్నాడు. అమ్మ నాన్నలు తనపై పెట్టుకున్న ఆశలు అతనికి ఎంతవరకు తెలిశాయో, లేదో తెలియదుగానీ ఈ కాలం వయసు మాయలో పడటం మాత్రం అతడికి వంట పట్టింది. తల్లి తండ్రుల కాయ కష్టం కన్నా బయట ప్రపంచంలోని మెరుగులు అతన్ని బాగా ఆకర్షించాయి. ఆ రోజు సాయంత్రం కిరణ్ కాలేజీ నుంచి వచ్చి తండ్రి ఎదుట కూర్చున్నాడు. "నాన్నా, నా ఫ్రెండ్ రాహుల్ కొత్త బైక్ కొనేశాడు". వింటున్నాడు రమేష్. "నాన్నా, నాకూ అలాంటి ఒక బైక్ కావాలి" అన్నాడు, ఆ మాట వాళ్లకు వినపడింది.

"నీ ఇంటర్ పూర్తైంది కాసిన్ని రోజులు ఆగు చూద్దాం, అంతవరకు కాలేజీకి బస్సులో వెళ్తే సరిపోతుంది" అంటూ అర్థం చేసుకొమ్మనట్లు చెప్పాడు.

"మీరు ఎప్పుడూ ఇలానే అంటారు. నాకు బైక్ తెచ్చిస్తే నేను వాడి లాగా సుఖంగా కాలేజీకి వెళ్ళి రావొచ్చు, అయినా నేను అడిగింది మీరెప్పుడైనా కుదరదు.. అనకుండా ఇచ్చారా?" అని అంటున్న మాటలు నిజంగా గుండెల్లో గునపాలు దింపుతున్నాయి.

మీరు నాకు ఈసారి బైక్ కొనివ్వకపోతే నేను చచ్చిపోతాను" అని గట్టిగా అన్నాడు.

"నేను వాడికి ఎలాగోలా నచ్చజెప్పి ఒప్పిస్తా , మీరు ఆలోచించకండి" అంది భార్య సీత.

"వాడు ఇప్పుడు మనం చెప్పే మాటలు విని, మన పరిస్థితులు అర్థం చేసుకొని మసలుకొనే స్థాయిలో లేదు" అంటూ కళ్ళు మూసుకున్నాడు రమేష్.



..............

"ఈరోజు నీ పుట్టినరోజు, కాస్త త్వరగా లేవరా కనీసం అందరం గుడికి వెళ్ళొద్దాం" అంది అమ్మ.

ఇక లేవక తప్పదన్నట్లు లేచి, స్నానం చేసి అప్పటికే తెచ్చి పెట్టిన కొత్త బట్టలు వేసుకొన్నాడు. అందరూ కలిసి గుడికి వెళ్లడానికి బయటకు వచ్చారు. ఇంటిముందు ఒక ముసుగు కప్పిన బండి కనపడింది అతడికి.

వెంటనే నాన్న వైపు చూసాడు. ఆయన అవునన్నట్టు తల ఊపాడు. అమ్మ తల నిమిరి వెళ్ళమని వీపు తట్టింది. ఆత్రుతగా ముసుగు తొలగించాడు, కళ్లముందు కోరుకున్న బండి కనపడేసరికి ఆనందం కట్టలు తెంచుకుంది. "నాన్నా థాంక్యూ.. థాంక్యూ. మీరు కొనిస్తారని అనుకోలేదు" అంటూ ఒక్క ఉదుటన బండిపై కూర్చున్నాడు.

"చిన్నా, నువ్వు ఆనందంగా ఉంటేనే కదరా, మేం సంతోషంగా ఉండేది. బాగా చదువుకో సరేనా" అంటున్న తల్లి మాటలు చెవికెక్కాయో లేదో కానీ బైక్ మాత్రం స్టార్ట్ అయిపోయింది. అమాంతం ఒక్క సారిగా గేర్ మారింది. కాళ్ల కింద పెట్టకుండా గిర్రున తిప్పాడు బైక్‌ను.

"కిరణ్, జాగ్రత్త బండి నడిపేటప్పుడు నిదానంగా వెళ్ళు, హెల్మెట్ పెట్టుకో, నిదానంగా కాలేజీకి వెళ్ళి మళ్ళీ ఇంటికి వచ్చేయ్, అయినా నీకు ఇంకా లైసెన్స్ కూడా రాలేదు" అంది అమ్మ. ఆ మాటలు లెక్కలోకి వచ్చినట్లు అనిపించలేదు అతనికి.

................

కోర్టు బోనులో చేయి కట్టుకొని జడ్జి గారి ముందు నిలబడ్డాడు రమేష్. "మిమ్మల్ని ఇక్కడ నిలబెట్టింది, ఉలుకు పలుకు లేకుండా ఉండటానికి కాదు. సమాధానం చెప్పండి" అంటూ గట్టిగా అడిగారు జడ్జి గారు. మౌనం అతని గొంతు నుండి సమాధానం రానీలేదు.

"మీరు మీ కొడుకును అతి ప్రేమతో పెంచడం వల్ల ఎన్ని నష్టాలు ఉన్నాయో తెలుసా? మీ కుటుంబానికి, అదే విధంగా పక్కన మరెన్నో కుటుంబాలకు తీరని వ్యథ తప్పదని గ్రహించలేరా? అయినా వయసులో ఉన్నవారు ఆలోచించలేరు, కనీసం మీరైనా ఆలోచించలేరా? ఈ వయసులో మీకు కనీసం సైకిల్ అయినా ఉండేదా? అలాంటిది మీ పిల్లవానికి బైక్ కొనిచ్చారు. దాంతో రోడ్లపై రేసులు పెట్టుకొని సమాజంలో ఎందుకు పనికిరాని వారిలా తయారవుతున్నాడు. వాళ్లకు అది అవసరం లేదని చెబితే వాళ్ళు ఏదో అయిపోతారని భయపడి తప్పు చేస్తున్నారు" అంటూ జడ్జి గారు అంటున్న మాటలకు సమాధానం లేక నోరు మెదపడం లేదు రమేష్.

కొడుకు కిరణ్ బైక్ తీసుకొని రోడ్డుపై స్నేహితులతో రేస్‌లో పాల్గొన్నాడు. అందులో జరిగిన ప్రమాదంలో వీటికి అసలు సంబంధమే లేని పెద్దాయన కాళ్ళు పోగొట్టుకున్నాడు. అసలు ఆ కుటుంబానికి ఆసరా లేకుండా పోయింది. వీటన్నిటికీ కారణం తల్లిదండ్రుల పెంపకం. కన్న బిడ్డలపై ప్రేమ ఉండొచ్చు కానీ అతి గారాబం ఉండకూడదు. వారి అవసరాలు తీర్చొచ్చు కానీ, సరదాలు కాదు. వారి బెదిరింపులకు భయపడితే జరిగే నష్టం సమాజానికి చాలా ఎక్కువగానే ఉంటుంది.

– సింగంపల్లి శేషసాయి కుమార్

# అగస్త్య మహర్షి ప్రతిష్ఠించిన బ్రహ్మసూత్ర లింగం



నిరాకారుడు, సమస్త లోక లయకారుడు పరమేశ్వరుడు. పుడమిలో ఎన్నో దివ్య క్షేత్రాలలో మహేశ్వరుడు కొలువుదీరి కొలిచిన వారిని కొంగు బంగారంగా కొనియాడబడుతున్నాడు. ముఖ్యంగా మన రాష్ట్రంలో ప్రవహించే జీవ నదులైన గోదావరి, కృష్ణా తీరాలలో ఎన్నో విశేష శైవ ధామాలు వందల సంవత్సరాలుగా నెలకొని ఉన్నాయి.

మన గ్రామాలు పురాతన ఆలయాలకు నిలయాలు. గ్రామసీమలు ఎంత స్వచ్ఛంగా, పచ్చగా, పాడిపంటలతో అలరారుతుంటాయో అంతే ఆధ్యాత్మికత సంతరించుకోవడం గమనించవలసిన విషయం. నిజమైన హిందూ పర్వదినాల వైభవం చూడాలంటే గ్రామాలకు వెళ్ళాలి.

అదే విధంగా శతాబ్దాల క్రితం రాజుల కాలంలో నిర్మించిన ఆలయాలు కూడా తమ పవిత్రతను, ప్రాధాన్యతను మరియు విశేషతను నిలబెట్టుకోవడం ప్రత్యేకం. మరో ముఖ్య విశేషం.. గ్రామాలలో నెలకొన్న ఆలయాలలో కనపడేది ఏమిటంటే ఆయా క్షేత్రాల పురాణ లేదా చారిత్రక గాథ. యుగాల నాటి పౌరాణిక సంఘటనలతో ముడిపడి ఉన్న అనేకానేక దేవాలయాలు మనం నివసించే పట్టణాల లేదా నగరాల చుట్టుపక్కల ఉండటం మరింత ప్రత్యేకం. అలాంటి ఒక పురాతన ఆలయం గురించి తెలుసుకుందాం.

### శ్రీ అగస్త్య మహర్షి

అగస్త్య అనే పదానికి 'వెలుగు చూపేవాడు' అని అర్థం చెబుతారు. సప్త మహర్షులలో ఒకరైన అగస్త్య మహర్షి మానవాళికి అనేక ధర్మాచరణ విధానాలను, భాషను, వ్యాకరణాన్ని, ప్రార్థనా విధి విధానాలను రూపొందించి అందించారని వేదాలు, ఇతిహాసాలు, అనేక పురాణాలూ తెలియచేస్తున్నాయి.

అంతేకాదు.. అనేక పవిత్ర పావన ప్రదేశాలలో శివలింగాలను ప్రతిష్టించి భావితరాలకు అందించారు. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో అనేక ప్రదేశాలలో ఉన్న శివాలయాలలోని లింగరాజును 'శ్రీ అగస్త్యేశ్వర స్వామి' అని పిలుస్తుంటారు. మహాముని మహేశ్వరుని ఆనతి మేరకు దక్షిణ భారతదేశానికి తరలి వచ్చినప్పుడు నిత్య పూజల నిమిత్తం ప్రతిష్టించిన లింగాలను ఆయన పేరు మీద పిలవడం జరుగుతోంది. ముఖ్యంగా మన రాష్ట్రంలో కృష్ణా తీరంలో పెక్కు శివాలయాలు శ్రీ అగస్త్య మహర్షి ప్రతిష్ఠిత లింగాలుగా క్షేత్ర గాథలు తెలియచేస్తున్నాయి.

### శ్రీ అగస్త్య దక్షిణ భారతదేశ యాత్ర

పర్వతరాజ పుత్రి పార్వతీ దేవితో పరమేశ్వరుని వివాహం నిశ్చయమైనది అన్న వార్త లోకాలన్నిటికి వ్యాపించినది. లోకకల్యాణార్థం జరుగుతున్న శుభకార్యాన్ని కనులారా చూడాలన్న ఆకాంక్షతో విశేష సంఖ్యలో అన్ని లోకాల వారు తరలి వస్తున్నారట. అపరిమిత సంఖ్యలో రావడంతో ఉత్తర భూభాగంలో భారం పెరిగిందట. దీనిని ఎలా నియంత్రించాలి? అన్న చర్చ వచ్చినప్పుడు త్రిమూర్తులు దీనిని అదుపు చేయగలవాడు ఒక్క అగస్త్యుడు మాత్రమే అని నిర్ధారించుకొన్నారట.

విషయం విన్న మహాముని "తనకు మహా కళ్యాణాన్ని వీక్షించే భాగ్యం లేదా?" అని బాధను వ్యక్తం చేశారట. దానికి శివపరమాత్మ ఎక్కడ నుండి అయినా వివాహాన్ని చూసే వరం అనుగ్రహించారట.

కృతజ్ఞతలు తెలుపుకొని భార్య "లోపాముద్ర" శిష్య ప్రశిష్యులతో కలిసి దక్షిణాపథానికి బయలు దేరారట. మహర్షిని వింధ్యకు ఆవల పంపడానికి మరో కారణం కూడా ఉన్నది. భారత ఖండాన్ని ఉత్తర, దక్షిణ భాగాలుగా విడదీసేవి వింధ్య పర్వతాలు. హిందూ పురాణాల ప్రకారం 'వింధ్య' అనే పదానికి అర్థం 'అడ్డుకోవడం'.

ఒకసారి నారద మహర్షి వింధ్య పర్వతరాజు వద్దకు వెళ్లారట. వింధ్యుని గొప్పతనాన్ని పొగుడుతూనే ఎత్తులో అతను 'మేరు పర్వత' సాటి కాదని అన్నారట. దాంతో అహం దెబ్బతిన్న వింధ్య రాజు తన ఎత్తును అపరిమితంగా పెంచేసారట. భూ మధ్యలో ఉండటం వలన అతని ఎత్తు వలన సూర్య, చంద్రుల గమనానికి ఆటంకం ఏర్పడింది.

అతని అహాన్ని చల్లార్చడానికి చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. వింధ్యుడు అగస్త్య మహాముని శిష్యుడు.

దక్షిణా పథానికి వెళుతున్న గురువుకి వంగి నమస్కరించారట వింధ్య పర్వత రాజు. తాను తిరిగి వచ్చేవరకు అలానే ఉండమని ఆదేశించారు గురువు. దానితో సూర్యచంద్రుల గమనం తిరిగి సజావుగా సాగింది. అలా వింధ్య దాటి వచ్చిన మహర్షి తాను మజిలీ చేసిన నదీతీరాలలో, సరస్సుల సమీపంలో, పుణ్యపావన ప్రదేశాలలో నిత్య పూజావిధుల కొరకు శివలింగాన్ని ప్రతిష్ఠించేవారట. నేటికీ ఆ శివలింగాలు పూజలు అందుకోవడం విశేషం.

## శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం

అగస్త్య మహర్షి ప్రతిష్ఠించిన లింగానికి పదవ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పాలించిన చాళుక్య రాజులు ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. అనంతర కాలంలో కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర పాలకులు చివరగా రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఆలయాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తారని తెలుస్తోంది. కొద్ది సంవత్సరాల క్రితం గ్రామస్తులు పూనుకొని ఆలయాన్ని పునః నిర్మించడమే కాకుండా కొన్ని నూతన సన్నిధులు ఏర్పాటు చేసుకొన్నారు.

తూర్పు ముఖంగా ఉన్న ఈ ఆలయానికి మూడు అంతస్థుల సుందర రాజగోపురాన్ని నిర్మించారు. రాజగోపురం, ఆలయ ముఖ మండపాలు చక్కని వర్ణమయ దేవీ దేవతా మూర్తుల రూపాలను జీవకళ ఉట్టిపడేలా చేశారు. ఆలయానికి వెలుపల కాకతీయుల కాలంలో ఏర్పాటు చేసిన నందీశ్వరుడు దర్శనమిస్తాడు. శిల్పం భిన్నం అయినందువల్ల వెలుపల ఉంచారట. ప్రాంగణం లోనికి అడుగు పెట్టిన కనిపించే విశేషం ధ్వజస్థంభం పక్కన కనిపించే రాతి దీప స్థంభం. కోస్తా జిల్లాలలో ధ్వజస్థంభం చెట్టు కాండంతో ఏర్పాటు చేస్తారు. రాయలసీమలో రాతి ధ్వజ, దీప స్తంభాలు ఏర్పాటు చేస్తారు.

ప్రదక్షిణాపథంలో ఆలయం వెనుక పంచముఖ లింగం, వరుసగా శ్రీ గణపతి, శ్రీ ధర్మశాస్త్ర,శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఉపాలయాలు ఉంటాయి. శ్రీ సరస్వతి, అపమృత్యు భయాన్ని తొలగించే శ్రీ ఆంజనేయుడు దక్షిణాముఖంగా తమ సన్నిధులలో దర్శనమిస్తారు.

ఆలయానికి ఈశాన్య బాగంలో నూతనంగా నవగ్రహ మండపం నిర్మించారు. ధ్వజస్థంభం వద్ద శ్రీ భైరవుడు దర్శనమిస్తారు. ఈ మధ్య కృష్ణ, గుంటూరు జిల్లాల్లోని చాలా శివాలయాలలో శ్రీ భైరవ, శ్రీ చండికేశ్వర స్వామి విగ్రహాల ఏర్పాటు పెరిగింది. మిగిలిన జిల్లాల్లోను కనపడుతోంది.



తూర్పు ముఖంగా ఉన్న ముఖమండపం విశాలంగా మధ్యలో పెద్ద నందీశ్వర విగ్రహం, అనుసంధానంగా మూడు సన్నిధులు కనపడతాయి. భిన్నమైన నంది స్థానంలో నూతనంగా చాలా చక్కని సుందరమైన నందీశ్వరుని ఆలయ పునః నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసుకొన్నారు.

దక్షిణం వైపున ఉన్న సన్నిధిలో శ్రీ వీరభద్రస్వామి స్థానక భంగిమలో దర్శనమిస్తారు. వీరశైవంలో శ్రీ వీరభద్ర ఆరాధన ప్రముఖమైనది. ఉత్తరం వైపున ఉన్న సన్నిధిలో అమ్మవారు శ్రీ పార్వతీ దేవి ఉపస్థిత భంగిమలో ప్రసన్న వదనంతో చక్కని అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. మధ్యలో ఉన్న ప్రధాన సన్నిధిలో శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారు బ్రహ్మసూత్రం ధరించి చందన, కుంకుమ, విభూతి లేపన, పుష్ప అలంకరణలో నేత్రపర్వంగా దర్శనం ప్రసాదిస్తారు.

## ఆలయ ఉత్సవాలు

నిత్య పూజలు నియమంగా జరిగే ఈ ఆలయం ఉదయం ఆరు గంటల నుండి పదకొండు వరకు; తిరిగి సాయంత్రం అయిదు గంటల నుంచి రాత్రి ఎనిమిది వరకు తెరిచి ఉంటుంది. మాస శివరాత్రి, పౌర్ణమి, కార్తిక మాస ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయి. మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

గణేష నవరాత్రులు, శ్రీ సుబ్రహ్మణ్య షష్టి, దసరా నవరాత్రులు, హనుమజ్జయంతి. శ్రీరామ నవమి, ఉగాది ఆస్థానం ఘనంగా చేస్తారు. శబరిమల మండల పూజ నుండి మకర జ్యోతి వరకు అయ్యప్ప దీక్ష తీసుకొన్న దీక్షాపరులతో ఆలయ పరిసరాలు నూతన శోభను సంతరించుకొంటాయి. అయ్యప్ప భజనలు నియమంగా చేస్తారు.

ఇంతటి విశేష చరిత్ర కలిగిన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయం విజయవాడ నుండి గుంటూరు వెళ్లే ప్రధాన రహదారికి మంగళగిరి నుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

**– ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

# ఫలాల్లో రారాణి



సీతాఫలం అనేది దక్షిణ అమెరికా మూలాలు కలిగిన ఒక తీపి పండు. దీనిని 'కస్టర్డ్ యాపిల్' లేదా 'షుగర్ యాపిల్' అని కూడా పిలుసానతరు. ఇందులో విటమిన్ సి, విటమిన్ బి6, మెగ్నీషియం, ఫైబర్ వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఈ పండు రోగనిరోధక శక్తిని పెంచడానికి, గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడుతుంది.

మన దేశంలో సీతాఫలాన్ని చాలా మంది ఇష్టంగా తింటుంటారు. రుచిలో తియ్యగా ఉండటమే కాకుండా, సీతాఫలాన్ని సలాడ్‌లు, స్మూతీస్, కేక్‌లు, పెరుగు, ఓట్ మీల్‌లో కూడా చేర్చవచ్చు. కాబట్టి సీతాఫలం తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీనితోపాటు, స్వాభావికమైన పోషక భాగాలు, అసంఖ్యాకమైన ఆరోగ్య ప్రయోజనాలతో పాటు పోషకాహార లోపం, ఖనిజ లోపాలను నిర్వహించడంలో సీతాఫలం ముందుంది.

సీతాఫలాన్ని హిందీలో 'సీతాఫల్' అని పిలుస్తారు, ఇది పుష్పించే మొక్కల అన్నోనేసియా కుటుంబానికి చెందిన ఉప ఉష్ణమండల పండు. ఇది వెలుపల ఆకుపచ్చ లేదా గోధుమ రంగులో ఉంటుంది మరియు లోపల మృదువైన, తోలు గుజ్జును కలిగి ఉంటుంది. సీతాఫలం చెట్టు 59 అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది. పసుపు ట్రంపెట్ లాంటి పువ్వులను కలిగి ఉంటుంది. పండినప్పుడు, సీతాఫలం పండ్లలో నల్లటి గింజలు ఉంటాయి. ఇది దీర్ఘ చతురస్రాకార ఆకారాన్ని కలిగి ఉంటుంది. గుజ్జు కండగలది, సువాసన, తీపి రుచిని కలిగి ఉంటుంది.

నోట్లో వేయగానే తియ్యగా కరిగిపోయే సీతాఫలాల్లోని ఔషధ విలువలపై ప్రజలకు అవగాహన పెరగటం వల్ల ఇప్పుడు వీటికి గిరాకీ పెరిగింది. వీటి ఆకులు మధుమేహాన్ని నియంత్రణలో ఉంచడం, అధిక బరువు తగ్గించడంతో, పాటు జలుబును కూడా నివారించేందుకు ఎంతగానో ఉపకరిస్తుంది. వీటిలో కెరోటిన్, థయామిన్, రిబోఫ్లేవిన్, నియాసిన్, విటమిన్ సి వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. సీతాఫలం పండు లోపలి గుజ్జు తింటే జీర్ణక్రియ ప్రక్రియ వేగవంతంగా పనిచేస్తుంది. అందుకే పలు కంపెనీలు కూడా మందుల తయారీకి ఈ పండ్లను వినియోగిస్తూ, దిగుమతి చేసుకుంటున్నారు.

సీతాఫలం ఆకుల్ని నీటిలో మరగబెట్టి ఆ నీటిని తాగితే షుగర్ లెవల్స్ తగ్గుతాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. ఇది ఇన్సులిన్‌గా పనిచేస్తుందని వారు చెబుతున్నారు. సీతాఫలం ఆకుల్లో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి చర్మ వ్యాధుల్ని తగ్గించడంలో సాయపడతాయి. ఈ ఆకును మెత్తగా పేస్టులా చేసి చర్మంపై అప్లై చేయాలి. మొటిమలు, ఎర్ర దద్దుర్లు, మంట, తామర వంటి లక్షణాల్ని ఈ పేస్టు అప్లై చేయడం వల్ల తగ్గుముఖం పడతాయి. చలికాలంలో ఈ పేస్టు ముఖానికి అప్లై చేసుకోవడం వల్ల చర్మం పొడిబారదు. ముఖం నిగనిగలాడుతుంది.

సీతాఫలం ఆకులు యాంటీ సెప్టిక్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. దీంతో.. ఈ ఆకులు గాయాలు త్వరగా మానేందుకు సాయపడతాయి. ఈ ఆకుల్ని పేస్టులా చేసి గాయాలపై అప్లై చేస్తే అవి ఇన్ఫెక్షన్ బారిన పడవు. అంతేకాకుండా త్వరగా మానిపోతాయని నిపుణులు వెల్లడిస్తున్నారు. సీతాఫలం ఆకుల్ని నమిలితో దంతాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. నోటి శుభ్రతను సైతం ఈ ఆకులు మెరుగుపరుస్తాయి.

చలికాలం ప్రారంభంలో ఎక్కువగా మార్కెట్‌లో కనిపించే ఈ ఫ్రూట్ స్వీట్‌గా ఉండటమే గాక ఎన్నో పోషకాలను కలిగి ఉంటుంది. ఇవి ఇమ్యూనిటీని బూస్ట్ చేయడంతో పాటు బాడీకి ఇన్‌స్టంట్‌గా ఎనర్జీని అందిస్తాయి. అయితే, సీతాఫలాన్ని మితిమీరి తింటే బెనిఫిట్స్ కలడానికి బదులు ప్రతికూల ప్రభావాలు చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సీతాఫలంలో ఫైబర్ అధికంగా ఉంటుంది. మితంగా తింటే ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, ఎక్కువగా తినడం వల్ల ఉబ్బరం, గ్యాస్, కడుపులో అసౌకర్యం కలుగుతుంది. కొన్ని సందర్భాల్లో, ఇది విరేచనాలకు దారితీస్తుంది.





అంతేకాకుండా, ఇందులో అధిక ఇనుము శాతం ఉండటం వల్ల, కొంతమందికి వికారం, మలబద్ధకం కడుపు నొప్పి రావచ్చు. ముఖ్యంగా, సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారు తమ వినియోగాన్ని పరిమితం చేసుకోవాలి. సీతాఫలం గుజ్జు మంచిదే అయినప్పటికీ, దాని విత్తనాలు., చర్మం శరీరానికి తీవ్రమైన హాని కలిగిస్తుంది. వాటిని మింగడం లేదా నమలడం ప్రమాదకరం.

సీతాఫలం గింజల చర్మంలో అన్నోనాసిన్ అనే ప్రమాదకరమైన సమ్మేళనం ఉంటుంది. ఈ న్యూరోటాక్సిన్ సమ్మేళనం మైటోకాండ్రియాలోని కీలక ఎంజైమ్‌ను అడ్డుకుంటుంది. కణాల శక్తిని ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని ఆపివేస్తుంది. అధిక రక్తపోటు నాడీ సంబంధిత సమస్యలు ఉన్నవారిలో ఇది నాడీ వ్యవస్థను ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. ప్రధానంగా, ఇది మెదడులోని నాడీ కణాలను దెబ్బతీస్తుంది. సీతాఫలం విటమిన్ ఎ, విటమిన్ బి6, విటమిన్ సి., జింక్., కాపర్ వంటి కొన్ని ముఖ్యమైన పోషకాల వంటి అనేక చర్మాన్ని సుసంపన్నం చేసే పోషకాల నిధి. ఈ శక్తివంతమైన పోషకాలు మోటిమలు, అలర్జీలు, గడ్డలు ఇతర చర్మ సంబంధిత రుగ్మతలతో సహా దీర్ఘకాలిక చర్మ పరిస్థితులు చర్మ సమస్యలకు చికిత్స చేయడంలో నిరోధించడంలో సహాయపడతాయి.

సీతాఫలం గింజల పొడి కళ్ళలో పడితే లేదా వాటిని తాకితే, కార్నియా దెబ్బతింటుంది. తీవ్రమైన గాయం సంభవించవచ్చు. కళ్ళు ఎర్రబడటం, నీరు కారడం వంటి లక్షణాలు సంభవించవచ్చు. సీతాఫలంలో తక్కువ గ్లైసెమిక్ సూచిక (బిఐ) ఉన్నప్పటికీ, ఇందులో అధిక స్థాయిలో సహజ చక్కెరలు కేలరీలు ఉంటాయి. దీని కారణంగా, ఈ పండును ఎక్కువగా తినడం వల్ల శరీరంలో కేలరీలు పేరుకుపోయి బరువు పెరుగుతుంది. మరోవైపు, ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులలో రక్తంలో చక్కెర స్థాయిలను కూడా ప్రభావితం చేస్తుంది.

చల్లని వాతావరణంలో, సీతాఫలం తినడం వల్ల శరీర ఉష్ణోగ్రత మరింత తగ్గుతుంది. జలుబు దగ్గు వస్తుంది. మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు సీతాఫలాన్ని తక్కువగా తినాలి. ఇందులో పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల ఇది మూత్రపిండాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. మూత్రపిండాల రుగ్మతలు ఉన్నవారికి సమస్యాత్మకంగా మారుతుంది.

గర్భిణీ స్త్రీలు ఈ పండు తినడానికి ముందు వైద్యుడిని కూడా సంప్రదించాలి. విత్తనాలను మింగితే, అవి విషపూరితంగా మారవచ్చు. అధిక రక్తపోటు, నాడీ సంబంధిత సమస్యలు మధుమేహ రోగులు వాటిని పరిమితం చేయాలి.

సీతాఫలం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నందున, ఇది ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. గుండె సమస్యలు, కేన్సర్ ప్రధానంగా, మెదడులోని నాడీ కణాలకు నష్టం కలగొచ్చు. పొటాషియం కంటెంట్ ఎక్కువగా ఉన్నందున కిడ్నీలపై అదనపు ఒత్తిడి పడి, కిడ్నీ డిసార్డర్స్ ఉన్నవారికి సమస్యాత్మకంగా మారుతుంది.

సీతాఫలంలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది మొత్తం రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా గాయాలను వేగంగా నయం చేయడానికి సహాయపడుతుంది.

– ఆనంద 'మైత్రేయ'మ్

## కవచంలా పనిచేసే తాళం

ప్రస్తుతం మార్కెట్లో కొత్తగా వస్తున్న డిజి కెమెరా డోర్ తాళాల్లో చాలా సదుపాయాలు ఉంటున్నాయి. ఇంటి నిర్మాణానికి భారీగా ఖర్చు పెడుతున్నాయి కనుక ఇంటి భద్రత విషయంలోనూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటారు.

డిజి తాళాలు రీచార్జి చేసుకునే బ్యాటరీలతో పని చేస్తాయి. ప్రత్యేకంగా బ్యాటరీలను అమర్చడం/ యూఎస్‌బీ పోర్ట్‌తోనూ రీచార్జ్ చేసుకోవచ్చు. తాళం లోపలి భాగంగా మెమొరీ కార్డు, ప్రాసెసర్, సిమ్, వైఫై నెట్‌వర్కుతో పని చేసే సిస్టం ఉంటాయి. వీటిని యజమాని బయోమెట్రిక్ పద్ధతిలో స్కాన్ చేసి తాళం తెరవొచ్చు. నాలుగు నుండి ఎనిమిది అంకెల తాళంపై ఉండే నంబర్లపై నమోదు చేసి పిన్ జనరేట్ చేసి ఉపయోగించవచ్చు. స్మార్ట్ కార్డ్‌ను స్కాన్ చేయడం ద్వారా, ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వైఫై/బ్లూ టూత్ ద్వారా వాడుకోవచ్చు. వీటితో పాటు దీనిలో మరెన్నో ఉపయోగాలు ఉన్నాయి.



కథ

# జలనిధి

ఉదయపురి రాజు ఇంద్రసేనుడు, తన రాజ్య ప్రజలను కన్నబిడ్డల్లా పరిపాలిస్తాడని మంచి పేరు ఉంది. రాజుకు వేట అంటే ఇష్టం. అందువల్ల ఒకనాడు మంత్రితో పాటు కొంతమంది పరివారంతో వేటకు బయలుదేరి వెళ్లాడు. అడవిలో జంతువులను వేటాడుతుండగా, ఒక్కసారి ఆకాశంలో మబ్బులు కమ్మి, అడవి అంతా చీకటి అలుముకుంది. దానికితోడు బోరున వర్షం కురిసేసరికి రాజు ఒకవైపు, మిగతావారు వేరొకవైపు విడిపోయారు. "ఈ వాతావరణంలో నుంచి ఎలా బయట పడాలా?" అని ఆలోచిస్తుండగా తన గుర్రకాలు బురదలో ఇరుక్కుపోయేసరికి అదుపు తప్పి పక్కనే ఉన్న మడుగులోకి జారిపోయాడు రాజు. తాను బురదనీటిలో చిక్కుకుపోయానని గ్రహించి, బయటకు రావడానికి ప్రయత్నించాడు. ప్రయత్నం ఫలించలేదు. చేసేదేమీ లేక రాత్రంతా భగవంతున్ని ధ్యానిస్తూ ఆ మడుగులోనే ఉండిపోయాడు.



తెలతెలవారుతుండగా వెలుతురు వచ్చింది. అందుబాటులో ఉన్న ఒక చెట్టు ఊడను చేతపట్టుకుని బయటకు రాగలిగాడు. తానెప్పుడూ ఆ మడుగు చూడలేదు.. అనుకుంటూ చుట్టూరా పరికించసాగాడు. అది చాలా పెద్ద నీటిమడుగు. చుట్టూరా అధిక వృక్ష సముదాయాలు కూడా ఉన్నాయి. ఇంద్రేసనుడికి ఆ పరిసర వాతావరణం ఎంతో ఆహ్లాదమనిపించింది. తిరిగి రాజ్యానికి బయలుదేరుతుండగా తప్పిపోయిన పరివారం కూడా ఎదురై అందరూ రాజ్యానికి చేరుకున్నారు.

ఇంద్రసేనుడు తన మందిరం చేరుకోగానే స్నానాల గదికి వెళ్లి, బయటకు వచ్చేసరికి తన శరీరాన్ని చూసుకుని ఆశ్చర్యపోయాడు. ఎన్నో యేళ్లుగా ఎన్ని మందులు వాడినా తగ్గని తన ఒంటి మీద ఉన్న మచ్చలు కనిపించకపోయేసరికి ఒకింత ఆశ్చర్యానికి, ఆనందానికి లోనయ్యాడు. మచ్చలు పోవడానికి రాత్రి తనున్న ఆ మడుగునీరే కారణమయ్యుంటుందని భావించి, వెంటనే రాజ్య వైదునయలచే ఆ నీటిని పరీక్షింపచేయించాడు.

"మహారాజా! ఇక్కడ ఉన్న మొక్కలు, వృక్షాల వల్ల ఈ నీరు ఔషధ గుణాలు కలిగి వుంది" అని చెప్పేసరికి– "నా లాగే ఎంతో మంది బయటకు చెప్పని వ్యాధిగ్రస్తులు ఉంటారని" భావించి, తన రాజ్యం నుంచి ఆ మడుగు వరకు రహదారి వేయించి పరిసరాలు శుభ్రం చేయించి, అక్కడ ఒక దేవాలయాన్ని కూడా కట్టించాడు రాజు. చుట్టుపక్కల ప్రజలు విషయం తెలిసి, ఆ మడుగులో స్నానమాచరించి, గుడిలోలోని దైవాన్ని దర్శించుకునేవారు. నిజానికి ఆ ప్రజలు గుడిలోని దైవంలో తమ రాజునే చూసుకునేవారు. ప్రజల బాగోగుల్ని చూసిన ప్రభువే వారికి దైవం.

**- కొప్పల కాశీ విశ్వేశ్వర రావు,** మంత్రిపాలెం










వార్త ఆదివారం



## బాలగేయం

### చిట్టీ పొట్టీ బుడుతల్లారా

చిట్టీ పొట్టీ బుడుతల్లారా
చిరుచిరునవ్వుల దివ్వెల్లారా
చెబుతా నేనొక మంచిమాట
చెవులొగ్గి శ్రద్ధగా వింటారా

జీవిత సత్యాలెన్నెన్నో
తేట తెలుగులో తెలిపేటి
వేమన శతకం చదవండి.

నీతిమంతులై మెలగండి
చద్దన్నం మూటలాంటి
సుద్దులెన్నొ నేర్పేటి
బద్దెన సుమతీ శతకం
బాలలకెంతో జ్ఞానదాయకం.

తేనెఊట లాంటిది మన
తీయనైన తెలుగు భాష
అమ్మ అన్న తొలిపలుకు
నేర్పినట్టి మాతృభాష
చిన్నచూపు చూడకండి
చిలుకల్లా పడకండి.

–నందిరాజు కృష్ణకుమారి

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

ఎస్.ఆశ్లేష, కనిగిరి

**ప్రశ్న: గాలిలో ఎగిరే పక్షుల మీద గురుత్వాకర్షణ శక్తి పని చేస్తుందా? లేదా?**

**జవాబు:** పని చేస్తుంది. పక్షులు తమ రెక్కలను బలంగా ఆడిస్తూ గాలిని కిందికి తోసివేస్తాయి. అదే ముందుకు వెళ్లడానికి శారీరక శక్తి/బలంగా ఉంటుంది. న్యూటన్ మూడవ గమన సూత్రం ప్రకారం, అంతే బలాన్ని గాలి ఈ పక్షుల రెక్కల మీద ఊర్ధ్వదిశ మీదుగా ప్రయోగిస్తుంది. ఇది పక్షులకు ప్రతిబలంగా ఉపయోగపడుతుంది. ఈ ప్రతిబలం గురుత్వార్షణ శక్తి బలాన్ని కూడా అధిగమించడం వలన పక్షులు గాలిలోకి పైకి ఎగరగలుగుతున్నాయి.

బి.మణికంఠ, నంద్యాల

**ప్రశ్న: భోజనం తరువాత అరటిపండు తినవచ్చా?**

**జవాబు:** వండిన పదార్థాలు జీర్ణం కావడానికి కొంత సమయం పడుతుంది. పండ్లలో విటమిన్‌లు, ఖనిజ లవణాలు అధిక స్థాయిలో ఉండటం వల్ల తిన్న కొద్దిసేపటికే జీర్ణమవుతాయి. వండిన పదార్థాలతో పాటు పండ్లను కూడా తింటే కడుపులో అవి వెంటనే జీర్ణం కాలేక, మిగిలిన పదార్థాలు జీర్ణమయ్యే వరకూ వేచి చూడాల్సి వస్తుంది. ఫలితంగా పండ్ల నుంచి తిన్న వెంటనే లభించవలసిన పోషక పదార్థాలు పూర్తిగా శరీరానికి లభించక వృథా అవుతాయి. భోజనం చేసిన తరువాత ఒకటిన్నర/రెండు గంటలకు తిన్న ఆహారం రక్తంలోకి మారుతుంది. ఆ తర్వాతే మంచినీరు పుష్కలంగా తాగాలి. పండ్లూ తినవచ్చు. భోజనం చేసిన తర్వాత కనీసం ఒక గంట తర్వాత పండ్లు తింటే వాటి పోషక విలువలు శరీరానికి అందుతాయి.





# విమాన ప్రయాణాన్ని ఆస్వాదించడం ఎలా?

2023లో ప్రపంచవ్యాప్తంగా 4.5 బిలియన్ల (450 కోట్లు) ప్రయాణికులు విమాన ప్రయాణాలు చేశారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2024లో 720కి పైగా విమానాల్లో 37.6 కోట్ల భారతీయులు విమానయానం చేసారని, ఈ సంఖ్య ఏడాదికేడాది పెరుగుతున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా దేశీయ విమానాల్లో ఒక నగరం నుంచి మరో నగరానికి విమాన ప్రయాణం చేయడానికి దాదాపు 1 నుంచి 2 గంటల సమయం పడుతుంది. ఇలా ఒకటి లేదా రెండు గంటల విమాన ప్రయాణ సమయాన్ని గడపడం చాలా సులభం, చూస్తుండగానే గమ్యస్థానానికి చేరుకుంటాం. కాని అమెరికా లేదా ఆస్ట్రేలియా లేదా యూకె లాంటి ప్రాంతాలకు విదేశీ విమాన ప్రయాణాలను చేస్తున్నపుడు కనీస సమయం 4 నుంచి 18 గంటల వరకు కూడా సమయం పడుతుంది.



మన ప్రయాణ అనుభవాలను కూడా ఆసక్తికరంగా రాస్తారు. అవకాశం దొరికితే మన పక్క సీట్లో కూర్చున్న వీరితో కొద్ది సేపు మాట్లాడవచ్చు. విమానంలో అందించే ఆహారాన్ని పరిమిత స్థాయిలో తీసుకోవాలి. సహచరులు లేదా దంపతులతో ప్రయాణం చేస్తే కార్డ్స్ కూడా సరదాగా ఆడుకోవచ్చు.

### ఉత్తమ మార్గాలు

డౌన్లోడ్ చేసుకున్న విజ్ఞాన దాయకమైన ఈబుక్స్ లేదా మన వెంట తీసుకువెళ్ళిన మనకు నచ్చిన పుస్తకాలను చదువుతూ సమయం గడపడం సముచిత మార్గంగా ఉంటుంది. మన భవిష్యత్తు కార్యక్రమాలను లేదా మనం రానున్న రోజుల్లో మన ప్రయాణాలను, చేయవలసిన పనుల ప్రణాళికలు చేసుకోవడానికి ఈ సమయం చక్కగా

దీనికి తోడుగా మధ్యలో విమానాలను మారడం కూడా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇంత ఎక్కువ సమయం విమానంలో కదలకుండా ఎకానమీ క్లాస్‌లో కూర్చుని ప్రయాణం చేయడం, సమయం గడపడం చాలా ఇబ్బందిగా ఉంటుందని ప్రయాణం చేసిన వారికే అర్థం అవుతుంది. కొన్ని గంటల విమాన ప్రయాణాలను కూడా ఆస్వాదిస్తూ, మనకు ప్రయోజనకరంగా మార్చుకుంటూ, మన జీవిత ఆశయాలను చేరుకోవడానికి వినియోగించుకుంటూ, మన జీవితాలను సుసంపన్నం చేసుకోవడానికి ఉత్తమ మార్గాలుగా మార్చుకోవడానికి ప్రయత్నాలు చేయడం మొదలు పెడదాం.

### వినోదాత్మకం మార్గాలు

సాధారణంగా విమాన ప్రయాణాలలో మనం చేసే పని సీటుకు అమర్చిన టీవీలో మనకు నచ్చిన భాషలో సినిమాలు లేదా టీవీ షోలు లేదా వినోదాత్మక చిత్రాలు చూడడం జరుగుతుంది. కొందరు తమకు నచ్చిన సినిమాలను లేదా సంగీతాన్ని లేదా పాటలను ఫోన్లో/పోడ్‌కాస్ట్‌లో డౌన్లోడ్ చేసుకొని కూడా ప్రయాణ సమయంలో వాటిని వీక్షిస్తారు. కొందరు వీడియో గేమ్స్ ఆడుకుంటూ కూడా సమయాన్ని గడుపుతుంటారు. మన అభిరుచులకు తగినట్లుగా మనకు నచ్చిన చిత్రాలను/డ్రాయింగ్స్ /కలరింగ్ గీయవచ్చు, నవలలు చదవచ్చు, సృజనాత్మక అల్లికలు చేయవచ్చు. కొద్ది మంది

ఉపయోగపడుతుంది. మన ఈమెయిల్స్‌ను చూసుకోవడంతో పాటు వాటికి సమాధానాలు ఇవ్వడం, మిత్రులకు లేదా ఇతరులకు కొత్తగా చేయవలసిన ఈ మెయిల్స్‌ను పూర్తి చేయడం మరో మార్గంగా ఉంటుంది. విమానంలో వైఫై సౌకర్యం లేక పోయినా విమానం దిగగానే ఈమెయిల్స్ బట్వాడా జరుగుతుందని మరువరాదు. మనకు నచ్చిన రచనలు చేసుకోవడానికి కూడా ఈ సమయాన్ని వినియోగించుకోవచ్చు. అధికారులైతే ఆఫీసుకు సంబంధించిన ముఖ్యమైన ఫైల్స్‌ను క్లియర్ చేయవచ్చు. సోషల్ మీడియా వేదికను చూసి కూడా అవసరమైతే సమాధానాలను ఇవ్వండి. క్రాస్ వర్డ్ ఫజిల్స్‌ను పూర్తి చేయవచ్చు. ఇతర భాషలు నేర్చుకోవడానికి సంబంధించిన పుస్తకాలను చదవండి.

### ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు

విమాన ప్రయాణ సమయంలో కొంత భాగాన్ని ప్రాణాయామం, ధ్యానం, స్వల్ప కదలికలు కలిగిన వ్యాయామాలు, నేత్రాలకు సంబంధించిన వ్యాయామాలు లాంటివి చేయడం మానవద్దు. 10-15 గంటలు కదలకుండా కూర్చోవడం ఇబ్బంది కాబట్టి మధ్య మధ్యలో కొద్దిసేపు లేచి నడవడం, శరీర భాగాలను కదిలించటం చాలా ఉత్తమమైన మార్గం. మెడకు నెక్ పిల్లో పెట్టుకోవడం మంచిది.

**(మిగతా 23వ పేజీలలో..)**

# నిరుపమాన దేశభక్తులు పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి

డా॥ గాదం గోపాలస్వామి, తిప్పిరిశెట్టి శ్రీ వేంకటరంగ నాయకులు రచయితలుగా పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి దంపతుల స్వాతంత్ర్య పోరాట సందర్భంలోని త్యాగమయ గాథను గ్రంథస్థం చేయటం అభినందనీయం. ఆజన్మాంతం, గాంధేయవాదులుగా జీవించిన ఆ దంపతుల దేశభక్తి ప్రపూరిత చరిత్ర, విస్మృత సమరయోధుల స్మృతిగీతగా వెలుగులోకి రావడం ఎంతైనా ప్రశంసనీయం. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం కార్యస్థానంగా, గాంధీజీ సిద్ధాంతాలను అమలు చేసే పోరాట దీక్షతో జైళ్లపాలయిన ఆ భార్యా, భర్తల జీవితం నాటి సమరయోధుల త్యాగశీలత, దేశభక్తి తత్పరతకు ప్రతిబింబం. నిండు గర్భిణిగా జైలుపాలయిన అంజలక్ష్మి ప్రసవం, బిడ్డకు అన్నప్రాశన, నామకరణం జైలు గోడల మధ్య జరగడంగా అపూర్వ సంఘటన. ఆగర్భ శ్రీమంతుల కుటుంబానికి చెందిన ఆ దంపతులు, స్వాతంత్ర్యానంతరం సంస్కరణ వాదులుగా సేవాధర్మంతో, యావదాస్తిని స్వాతంత్ర్య ఉద్యమానికి అర్పించి దీనజనోద్ధరణకు అంకితం కావటం, ఆకలితో అలమటించే అభాగ్యులకు అన్నదానం, విద్యా, వైద్యసేవలు నిస్వార్థ మానవతా ధర్మంగా అందించటం, 35 సంవత్సరాలు ఎన్ని కష్టాలు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో జీవన లక్ష్యాన్ని నిర్వర్తించడం ఈ జీవిత చరిత్ర అత్యద్భుతంగా తెలియచేస్తోంది. పసల కృష్ణమూర్తి దంపతుల కుమార్తె కృష్ణభారతికి(90) 2022 జూలైలో దేశ ప్రధాని భీమవరం పర్యటన సందర్భంలో పాదాభివందనం చేయటం ఈ పవిత్ర జీవిత చరిత్రకు కొసమెరుపు.



**పుస్తక సమీక్ష**

**(నిరుపమాన దేశభక్తులు పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి-రచన: డా॥ గాదం గోపాలస్వామి; వెల: రూ.100/-లు; ప్రతులకు: డా॥ పసల వీణ, శ్రీ దివ్యశక్తి డొమెయిన్, స్నేహపురి కాలనీ, హైదరాబాద్-500 035)**

# కరోన మృత్యువిహారం



సుతారపు వెంకటనారాయణ 'కరోన కదలికలు' కవితా సంపుటిలో 100 కవితలున్నాయి. కవి వెంకట నారాయణ విభిన్న దృక్కోణాలలో, వైవిధ్య భరితంగా కరోనా విలయ విహారాన్ని కవితా పరంగా స్పృశించారు. ప్రపంచంలో రెండు సంవత్సరాల పాటు లక్షలాది మందిని పొట్టన పెట్టుకొన్న ఈ భయంకర రక్కసిని కవి 'గో బ్యాక్' అంటూనే రక్షించమని, మన్నించమని, కరుణ చూపమని, మళ్లీ మళ్లీ రాకుండా వెళ్లిపొమ్మని.. నాటి సామాజిక విపత్కరతను వివిధ కవితలలో ప్రతిబింబింపచేసారు. ఖ

"కరోనా కాలం శాశ్వతం కాదు. కాలచక్రంలో ఒక పరిణామమే" అంటూ కాలచక్రం కవితలో మనకు ప్రకృతి సంరక్షణ, క్రమశిక్షణ నేర్పిందన్నారు. అహంకారంతో విర్రవీగే మానవ రూపాల కళ్లు తెరిపించిందన్నారు. 'దూరయోదవన' కవితలో ఫాస్ట్ ఫుడ్‌ల ప్రయోగాలు తగ్గి, పటిష్ట ఆహార వినియోగం పెరిగిందని.. కరోనా ప్రభావం తెచ్చిపెట్టిన మేలును వివరించారు. ప్రపంచ మానవాళికి కరోనా కాలం నేర్పిన పాఠాలు, గుణపాఠాలు, కరోనా కాలంలో కబళించిన అభాగ్యుల విషాద వేదన కవి గుర్తు చేసారు. ఆ కాలంలోని మానవ నిస్సహాయత, వలస కూలీల చితికిన బతుకులు, కరోనా రక్కసి కాటుకు బలి అయిన సమాజ స్థితిగతుల్ని కవి అద్భుతంగా అక్షరీకరించారు.

**(కరోన కదలికలు-రచన: సుతారపు వెంకట నారాయణ; వెల: రూ.100/-; ప్రతులకు: సుతారపు వెంకట నారాయణ, 12-11-367/6, వారాసిగూడ, సికిందరాబాద్)**

# 'మధుర ద్రాక్షాగుళుచ్ఛం'-విస్సాప్రగడ

ఆధ్యాత్మిక వేదాంత విషయాలను తియ్యని ద్రాక్షలుగా రుచిమయంగా అందించటం అందరికీ సాధ్యం కాదు. 'మధుర ద్రాక్షా గుళుచ్ఛము' శీర్షికతో విస్సాప్రగడ రామ లింగేశ్వరరావు 34 ఆధ్యాత్మిక వ్యాసాలను పుష్పమాలా గుళుచ్ఛంగా, అతిసుందర సులభ గ్రాహ్యమైన మాధుర్యంతో, తెలుగు వ్యాసాలుగా దర్శింపచేసారు. మహత్తర జ్ఞానప్రదాయిని అయిన శ్రీమద్భగవద్గీత, అఖండ పారమార్థిక బోధ అయిన యోగవాసిష్ఠం రెండు గ్రంథాల మహత్మ్యాన్ని శ్రీరామచంద్ర, అర్జునులను కార్యోన్ముఖులను చేసిన అద్భుత జ్ఞానమార్గ ఉపదేశ దివ్య సందేశాన్ని తొలి వ్యాసం 'నేనెరిగిన భగవద్గీత' వివరిస్తోంది. స్థాలీపులాక న్యాయంగా జ్ఞాన మార్గమే మోక్షసాధనకు, జన్మరాహిత్యానికి ఆచరణీయమనే భగవత్ తత్వాన్ని పఠనీయంగా ఈ సంపుటి వైవిధ్య విశిష్టంగా అందిస్తోంది. తెలుగులో తిరుప్పావై సరళమైన శైలిలో విశ్లేషించారు. మన ఆత్మలు పరిత్యజించిన పడవల వలె చైతన్యం అనే నది పైన పరమాత్మ అంతర్వాణికి దూరంగా పాషాణాల వైపు కొట్టుకునిపోతున్న ఈ రోజులలో విస్సాప్రగడ రామలింగేశ్వరరావు భారత, భాగవత, రామాయణాలు, ఆర్ష కావ్య వాఙ్మయం నుంచి ఎంపిక చేసిన ఆణిముత్యాల వంటి జ్ఞానదీప్తి ఈ వ్యాస సంపుటి ద్వారా ప్రసరింపచేసారు.



**(మధుర ద్రాక్షా గుళుచ్ఛము(ఆధ్యాత్మిక వ్యాస సంపుటి)-రచన: విస్సాప్రగడ రామలింగేశ్వరరావు; వెల: రూ.100/-; ప్రతులకు: విస్సాప్రగడ రామలింగేశ్వరరావు, 11-10-64, ఎస్‌బిఐ కాలనీ, రోడ్ నం.3, కొత్తపేట, హైదరాబాద్)**

కథ

# ధీర వనిత

ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్

**చైనాలో బీజింగ్ నగరంలో ఉన్న దాదాపు వంద కోట్ల జనాభాలో లీ, జియాహో భార్యా భర్తలుగా నివసిస్తున్నారు. వాళ్ళకి ఒక కుమార్తె. పేరు జెంగ్. వాళ్ళది దిగువ మధ్య తరగతి కుటుంబం.**

1989 తాలిమన్క్ స్కేర్ సంఘటన తరువాత, చైనాలో ఆర్థిక స్థితి గమనం మందగించిన రోజులవి. 1990 దశకం మొదటి సగంలో మళ్ళీ ఆర్థిక స్థితి పుంజుకోవడం ప్రారంభించింది. జియాహో తనకున్న కొద్ది పొలంలో చైనాలో ఉపయోగించే ఔషధ మూలికల పంటలను పండించే వాడు. దాని వల్ల అతని ఆదాయం బాగానే వచ్చేది. అందుచేత ఏకైక సంతానం అయిన జెంగ్‌కి మంచి చదువు చెప్పించసాగాడు. జెంగ్ కూడా అఖండమైన తెలివితేటలు కలది. ఆ అమ్మాయి చదువులోనే కాక, ఆట పాటలలో కూడా చక్కగా రాణించేది. ఈత అంటే అమితంగా ఇష్టపడేది. జెంగ్‌లోని ప్రతిభ గుర్తించిన ప్రభుత్వం, అన్ని సౌకర్యాలతో ఉచితంగా ఈత కోచింగ్ ఏర్పాటు చేసింది. పువ్వు పుట్టినప్పుడే పరిమళిస్తుంది అన్నవిధంగా జెంగ్ చిన్నతనంలోనే ఈతలో అత్యంత ప్రతిభ కనపరిచేది. స్కూల్లో ఈత పోటీల్లో ఎన్నో పతకాలు గెలుచుకునేది. అలాగే బయట కూడా వివిధ స్థాయిలలో పతకాలు గెలుచుకోవడం జెంగ్‌కి సాధారణం అయిపోయింది. తమ కుమార్తె ప్రతిభాపాటవాలు చూసి లీ, జియాహో ఎంతో సంతోషించేవారు.



జియాహో ఔషధ మూలికలను పండించే వ్యాపారం చేస్తున్నాడు కనుక, తన కుమార్తె జెంగ్‌ని ఇంగ్లీష్ డాక్టర్ చెయ్యాలని కుతూహలపడుతుండేవాడు. జెంగ్‌కి పదమూడవ సంవత్సరం వచ్చింది.

చైనాలో ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో మూడవ వారంలో విఫాంగ్‌లో గాలిపటాల పండగ చేస్తారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గాలిపట అభిమానులు అక్కడకి చేరుకుంటారు. గాలిపటాల పండగ పదిహేను రోజుల పాటు జరుగుతుంది. అప్పుడు వివిధ రంగులు, ఆకృతులు ఉన్న గాలిపటాలని ఎగురవేస్తారు. జెంగ్ ఆ పండగ అంటే చాలా ఉత్సాహపడింది. అందుకోసం తన ఇంటి దగ్గరే గాలి పటాలు ఎగురవేయడం ప్రాక్టీసు చేయడం మొదలు పెట్టింది. దానికోసం రంగు రంగుల, వివిధ రకాలైన గాలిపటాలు కొనుక్కుంది. జియాహో కూతురు అడిగిందే తడువుగా సంతోషంగా జెంగ్‌కి కావలసినవి కొనిపెట్టాడు.

ఆ రోజు జెంగ్ ఉత్సాహంగా గాలి పటాన్ని, మొదటి అంతస్తులో ఉన్న వాళ్ళ ఫ్లాట్ బాల్కనీలో నించుని, ఎగురవేస్తోంది. కొంతసేపు అయిన తరువాత, గాలి హఠాత్తుగా వేగంగా వీచింది. గాలిపటం దారంతో సహా తెగిపోయి అక్కడకి దగ్గరలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కి చిక్కుకుంది.

జెంగ్ వెంటనే బాల్కనీ మీద నుంచి వంగి దారాన్ని, గాలి పటాన్ని అందుకోవడానికి ప్రయత్నించింది. అయినా అందలేదు. అప్పుడు బాల్కనీ, పిట్టగోడ మీద కాలు పెట్టి బాగా ముందుకు వంగింది. ఆ వంగడంలో, జెంగ్ పట్టు తప్పి, మొదటి అంతస్తు నించి కిందికి పడిపోయింది. అలా పడిపోవడంలో నిలదొక్కుకోలేక, జెంగ్, రెండు చేతులు ట్రాన్స్‌ఫార్మర్‌కి బలంగా తగులుకున్నాయి.

హై వోల్టేజ్ విద్యుత్ షాక్ కొట్టి స్పృహ లేకుండా కిందకి పడిపోయింది. అప్పుడు ఆ బిల్డింగ్‌లో ఉన్న కొంతమంది మనుషులు, జెంగ్‌ని, మెల్లిగా కూర్చోపెట్టి తమకు తోచిన, చేయగలిగిన సపర్యలు చేయసాగారు.

విషయం విన్న జియాహో వెంటనే అంబులెన్సుకి ఫోన్ చేసి వేగంగా జెంగ్ ఉన్న చోటకి పరిగెత్తాడు. అక్కడ జెంగ్ స్పృహలేని స్థితిలో పడి ఉంది. రెండు చేతులు బాగా మాడిపోయి బొగ్గు ముక్కల్లా తయారు అయ్యాయి. తన కూతురి పరిస్థితి చూసిన అతనికి దుఃఖం ఆగలేదు.

అంతలో అక్కడికి లీ ఏడుస్తూ పరిగెత్తుకుంటూ వచ్చింది. ఆవిడని అక్కడున్న స్త్రీలు కొందరు ఓదార్చి, ధైర్యం చెప్పారు.

క్షణాలలో అంబులెన్స్ వచ్చింది. జెంగ్‌ని పెకింగ్ యూనియన్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు.

చైనాలో అక్కడి ప్రజలకి అనారోగ్యం వస్తే, లేదా ప్రమాదం సంభవిస్తే అన్ని ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది. ఒకవేళ వేరే దేశపౌరులు అక్కడ ఉంటే వాళ్ళు హెల్త్ ఇన్సూరెన్స్ చేయించుకోవలసి ఉంటుంది. అందుచేత జియాహోకి ఆర్థిక స్థోమత పెద్దగా లేకపోయినా ఎటువంటి ఇబ్బంది లేకుండా, జెంగ్‌కి, ట్రీట్‌మెంట్ జరుగుతుంది.

హాస్పిటల్లో జెంగ్‌ని ఐ.సీ.యూ.కి తరలించారు. అక్కడ ఒక భారతీయ డాక్టర్ పని చేస్తున్నాడు. అతని పేరు గోపాలకృష్ణ. పదహారణాల తెలుగువాడు. అతను సర్జరీ, ఐ.సీ.యూ. మానేజ్‌మెంట్‌లలో సూపర్ స్పెషాలిటీస్ చేసాడు. చైనీస్ భాష బాగా నేర్చుకున్నాడు.

చైనాలో రూల్ ప్రకారం మంచి మెడికల్ డిగ్రీలు ఉండి, చైనీస్ భాష తప్పనిసరిగా నేర్చుకుని ఉంటేనే డాక్టర్‌గా పని చేయవచ్చు. అయితే అక్కడ ప్రైవేటు హాస్పిటల్లో మాత్రమే పని చేయడానికి అనుమతి ఇస్తారు. కానీ గోపాలకృష్ణ పని చేస్తున్నది గవర్నమెంట్ హాస్పిటల్.

అతను ప్రత్యేక స్పాన్సర్‌షిప్ తీసుకుని అక్కడ పని చేయడానికి అనుమతి పొందాడు. గోపాలకృష్ణ పెకింగ్ యూనియన్ మెడికల్ కాలేజీ హాస్పిటల్లో చేరిన అనతి కాలంలోనే మంచి పేరు సంపాదించాడు. పేషెంట్స్‌ను అత్యంత శ్రద్ధతో చూస్తాడని, అతని డయాగ్నోసిస్ నూటికి నూరు శాతం కరెక్ట్ అవుతుందని హాస్పిటల్లో స్టాఫ్ అనుకుంటూ ఉంటారు.

అతని దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకుని, స్వస్థత పొంది వెళ్ళిన పేషెంట్స్ అతణ్ణి దేవుడుగా కొలుస్తారు. ఆ దేశంలో అటువంటి నమ్మకాలు లేవు కనుక అతనిని తమ ప్రాణ ప్రదాతగా అనుకుంటూ కృతజ్ఞతా భావం కనపరుస్తూ ఉంటారు పేషెంట్స్.

జెంగ్‌ని అత్యంత శ్రద్ధతో పరీక్షించాడు గోపాలకృష్ణ. కొన్ని పరీక్షలు చేయించాడు. అవన్నీ పరిశీలించిన తరువాత అతను ఒక నిర్ణయానికి వచ్చాడు.

జియాహోని, లీ తన రూంకి పిలిపించాడు. అక్కడ సంభాషణంతా చైనీస్ భాషలో సాగింది.

"నమస్కారం డాక్టర్ గారు, మీరు చాలా తెలివైన వారని, పేషెంట్స్‌కి చక్కటి ట్రీట్‌మెంట్ చేస్తారని, మీ చేతిలో పడితే ఆ పేషెంట్ పూర్తిగా కోలుకుని ఇంటికి వెళతాడని అందరూ చెప్పుకుంటున్నారు" అన్నాడు జియాహో, డాక్టర్ గోపాలకృష్ణని, మెచ్చుకోలుగా చూస్తూ. "మీ అభిమానానికి ధన్యవాదాలు. నేను నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. ఆ తరువాత భారం నేను నమ్మే, మీరు నమ్మని భగవంతుడిపై వేస్తాను" అన్నాడు డాక్టర్ గోపాలకృష్ణ నవ్వుతూ.

"ఏది ఏమైనా మా అమ్మాయి మీ చేతిలో పడింది గనుక చాలా అదృష్టవంతురాలు అనుకుంటున్నాం డాక్టర్" అన్నాడు జియాహో.

"కానీ నేను మీకో చెడు వార్త చెప్పవలసి వస్తోంది" అన్నాడు గోపాలకృష్ణ సాలోచనగా.

అతని మాటలకి ఉలిక్కిపడి ఒకరి ముఖం, ఒకరు చూసుకోసాగారు జియాహో, లీ.

"మా అమ్మాయి ప్రాణానికి ఏమీ ప్రమాదం లేదు కదా డాక్టర్ గారు?" అని అడిగింది లీ ఉబికి వస్తున్న కన్నీటిని బలవంతంగా ఆపుకోవడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తూ. జియాహో మగవాడు కనుక కాస్త గంభీరంగా కనిపించినా, అతని మానసిక స్థితికి, అతని భార్య మానసిక స్థితికి పెద్దగా తేడా లేదు.

"అబ్బే.. జెంగ్ ప్రాణానికి ఏమీ ప్రమాదం లేదు. కాకపోతే...... కాకపోతే...... ప్రమాదంలో కొట్టిన ఎలక్ట్రిక్ షాక్ వలన.... జెంగ్ రెండు చేతులు బాగా దెబ్బ తిన్నాయి. అవి అలాగే ఉంచేస్తే, అమ్మాయి శరీరమంతా ఇన్ఫెక్ట్ అయ్యే ప్రమాదం ఉంది. కనుక మీ కూతురు ప్రాణం కాపాడడం కోసం ఆమె రెండు చేతులు తీసేయవలసి వస్తోంది. తల్లిదండ్రులుగా మీకీ మాట చెప్పి, ఆ పని చేద్దామని...." అంటూ ఆగిపోయాడు గోపాలకృష్ణ.

"అంటే నా కూతురు జీవితాంతం చేతులు లేకుండా అవిటిది అయిపోతుందా? అసలే ఆడపిల్ల.. పసిది. ఎలా బతుకుతుంది డాక్టర్?"

**"మా అమ్మాయి ప్రాణానికి ఏమీ ప్రమాదం లేదు కదా డాక్టర్ గారు?" అని అడిగింది లీ ఉబికి వస్తున్న కన్నీటిని బలవంతంగా ఆపుకోవడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తూ. జియాహో మగవాడు కనుక కాస్త గంభీరంగా కనిపించినా, అతని మానసిక స్థితికి, అతని భార్య మానసిక స్థితికి పెద్దగా తేడా లేదు.**

అంటూ బిగ్గరగా ఏడవసాగింది.

లీ, జియాహో తన దుఃఖాన్ని పంటి బిగువున భరిస్తూ, లీని అనునయంగా భుజం మీద చెయ్యి వేసి ఓదార్చసాగాడు.

"మీరేమీ అలా అనుకోకండి. పరిస్థితిని బట్టి అయిదు, ఆరు నెలలలో జెంగ్‌కి కృత్రిమ చేతులు బిగించవచ్చు. ఆ తరువాత మెల్లి మెల్లిగా అలవాటు చేసుకుంటూ కొన్నాళ్ళకి మాములుగా పనులు చేసుకోవచ్చు. బుదమాగర్ అనే ఆఫ్ఘన్ దేశస్థుడు యుద్ధంలో రెండు కాళ్ళు పోగొట్టుకున్నాడు. అతను కృత్రిమ కాళ్ళతో ఎవరెస్ట్ పర్వతం ఎక్కాడు. మా దేశానికి చెందిన అరుణిమా సిన్హా అనే యువతి, రైలు ప్రమాదంలో రెండు కాళ్ళు పోగుట్టుకుని, కృత్రిమ కాళ్ళతో ఎవరెస్ట్ శిఖరం ఎక్కింది. ఆ విధంగా కృత్రిమ కాలుతో ఎవరెస్ట్ శిఖరం ఎక్కిన ప్రప్రథమ ప్రపంచ మహిళగా ప్రసిద్ధికెక్కింది. అరుణిమా సిన్హా అంతటితో ఆగిపోలేదు. ప్రపంచంలో వివిధ ఖండాలలో ఉన్న ఎత్తైన పర్వతాలన్నీ ఎక్కాలనే దృఢ సంకల్పంతో ఉంది. మీరేమీ అధైర్యపడకండి. భవిష్యత్తులో జెంగ్‌కి తల్లిదండ్రులుగా మీరు ఆ అమ్మాయికి ప్రోత్సాహం, మనోధైర్యం ఇవ్వాలి.

నేను ఈ రోజు చెపుతున్నాను చూడండి. ఒకరోజు జెంగ్ ప్రపంచ ప్రఖ్యాతి గాంచి మీకూ, అంతో ఇంతో నాకూ గర్వకారణం అవుతుంది. ఇది చెపుదామనే మిమ్మల్ని రమ్మన్నాను. ఇంకొక ముఖ్య విషయం. మత్తు వీడిన తరువాత, జెంగ్‌కి మొట్టమొదటసారిగా రెండు చేతులు లేవని తెలిసిన తరువాత విపరీతమైన ఉద్వేగానికి, మానసిక ఒత్తిడికి గురవుతుంది. ఆ క్షణం నుంచే ఆ అమ్మాయికి, మీరు నైతిక బలం, ధైర్యం ఇవ్వాలి" అన్నాడు గోపాలకృష్ణ.

జియాహో, లీ మౌనంగా.. అంగీకారంగా తలలు ఊపారు.

అంతలో గోపాలకృష్ణ అసిస్టెంట్ సర్జరీకి అన్ని ఏర్పాట్లు అయ్యాయని ఫోన్ చేసాడు.

"సరే నేను ఆపరేషన్ థియేటర్‌కి వెళుతున్నాను. నేను చెప్పిన విషయాలు జాగ్రత్తగా గుర్తుకు పెట్టుకోండి. ఆపరేషన్ కాస్త టైం పడుతుంది" అంటూ రూం బయటకి నడిచాడు గోపాలకృష్ణ.

"డాక్టర్ గారూ అమ్మాయిని మీ చేతులో పెట్టాం. మీరే చూసుకోవాలి" అంది, లీ కంట తడి పెడుతూ.

జియాహో కూడా అవే తన మాటలు అన్నట్లుగా తల ఊపాడు. అతని కను కొలనలలో నీటి బిందువులు గోపాలకృష్ణకి కనిపించాయి.



"డోంట్ వర్రీ" అంటూ జియాహో భుజాలపై రెండు చేతులు ఉంచి, బయటకి నడిచాడు, గోపాలకృష్ణ.

జియాహో, లీ అతను వెళ్ళిన వైపు చూస్తూ ఉండిపోయారు.

.................

జెంగ్ ఆపరేషన్ ఎటువంటి దుష్ఫలితాలు లేకుండా విజయవంతంగా అయ్యింది. అలాగే ఫిజియో థెరపిస్ట్ సహాయంతో తొందరగానే కోలుకుంది. గోపాలకృష్ణ సూచించిన విధంగా జెంగ్‌కి ఆపరేషన్ అవగానే ఒక సైకియాట్రిస్ట్‌తో సైకోథెరపీ కూడా ఇప్పించడం ప్రారంభించారు.

ఆ సమయంలో జెంగ్ చాలా పుస్తకాలు చదివింది. జెంగ్ చదివిన పుస్తకాలలో మన మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం గారు రాసిన పుస్తకాలు ఉన్నాయి. అందులో 'వింగ్స్ ఆఫ్ ఫైర్' కూడా ఉంది. ఆ పుస్తకం జెంగ్‌కి ఎంతో స్ఫూర్తినిచ్చింది.

జెంగ్, గోపాలకృష్ణ అనుకున్న దానికన్నా- శారీరకంగాను, మానసికంగాను చాలా తొందరగా కూడా కోలుకుంది. జియాహో, లీ సంతోషించారు.

ఆపరేషన్ అయిన ఆరు నెలల తరువాత జెంగ్‌కి కృత్రిమ చేతులు ఏర్పాటు చేసారు.

జెంగ్ వాటితో వస్తువులను పట్టుకోవడం నేర్చుకుంది. క్రమంగా స్కూల్‌కి వెళ్ళడం, ఇతర పనులు చేయడం నేర్చుకుంది. జెంగ్ శరీరం పెరిగి పెద్దదవుతున్నప్పుడల్లా, ఆ కృత్రిమ చేతులకి మార్పులు చేర్పులు చేయాల్సి వస్తూండేది.

జియాహో ఓపికగా అన్నీ చేయిస్తే, లీ కూతురికి అవసరమైన సపర్యలు చేసేది.

జెంగ్ విపరీతంగా శ్రమించి, తన కాళ్ళతో వస్తువులను పట్టుకోవడం , అటు, ఇటూ కదిలించడం, కాళ్ళతోనే రాయడం నేర్చుకుంది.

కాలక్రమేణా కాళ్ళతో రాయడంలో నైపుణ్యం సంపాదించింది. ఒక రోజున "నాన్నా, నేను మెడిసిన్ చదువుతాను" అంది జెంగ్ తన తండ్రి జియాహోతో.

"తప్పకుండానమ్మా. నేను ఈ రోజు నుంచే ఆ ప్రయత్నంలో ఉంటాను" అన్నాడు జియాహో ఆనందంగా.

"కానీ అమ్మాయిని డాక్టర్ చదువు చదవనిస్తారా!?" అంటూ తన సందేహం వెలుబుచ్చింది లీ.

"నా బంగారు తల్లి జెంగ్‌ని ఎందుకు చేర్చుకోరూ? మన అమ్మాయి పెద్ద డాక్టర్ అయ్యి, డాక్టర్ గోపాల కృష్ణలా ఎంతో మందికి మంచి వైద్యం చేస్తుంది. నీకూ, నాకూ కూడా" అన్నాడు జియాహో నవ్వుతూ.

"అలాగే కానీ" అంది లీ. జెంగ్ తను డాక్టర్ అయినట్లు కలలు కనసాగింది.

ప్రభుత్వం వాళ్ళు జెంగ్ అభ్యర్థనని ప్రత్యేకంగా భావించి మెడిసిన్ చదవడానికి అనుమతించారు. జెంగ్ చాలా శ్రద్ధగా, కష్టపడి ఏ ఇతర విద్యార్థికి, విద్యార్థినికి తీసిపోకుండా, ఎం.బి.బి.ఎస్. ఫ్లయింగ్ కలర్స్‌తో పాస్ అయింది. చాలా సబ్జెక్టులలో గోల్డ్ మెడల్ సంపాదించింది. విధి తనతో వికృతంగా ఆడుకున్నా స్ఫూర్తితో తన చిన్ననాటి కల పూర్తి చేసుకుంది.

జెంగ్ మనస్సులో ఇంకా ఏదో చెయ్యాలని, సాధించాలనే తపన నిరంతర ప్రవాహంలా కొనసాగుతోంది. ఆ తపనే జెంగ్‌కి మరిన్ని విజయాలు తెచ్చిపెట్టే శక్తిగా మారింది. ఆ శక్తితో ఆమె జీవితంలో ముందుకు దూసుకుని వెళ్ళింది.

జెంగ్ తీసుకునే ప్రతి నిర్ణయానికి తల్లిదండ్రుల అండదండలు, డాక్టర్ గోపాలకృష్ణ ప్రోత్సాహం ఉంటున్నాయి.

.....................

జెంగ్ మళ్ళీ ఈత ప్రాక్టిసు మొదలు పెట్టింది. కానీ స్విమ్మింగ్ పూల్‌లో ప్రాక్టిసు చేసే ఇతర ఈతగాళ్ళు జెంగ్‌ని చిన్న చూపు చూసేవారు. కొంత మంది వెక్కిరించేవారు.

**"అన్నీ బాగున్న మేమే ఈత కొట్టాలంటే ఆపసోపాలు పడుతున్నాం. చేతులు లేని నువ్వు ఏం ఈదుతావు? " అంటూ తనతో మెడిసిన్ చదివిన ఒకమ్మాయి జెంగ్‌ని, తరచూ హేళన చేసేది.**

"అన్నీ బాగున్న మేమే ఈత కొట్టాలంటే ఆపసోపాలు పడుతున్నాం. చేతులు లేని నువ్వు ఏం ఈదుతావు? మాతో పోటీలలో ఏం పాల్గొంటావు? హాయిగా ఇంటి దగ్గర నీ డాక్టర్ ప్రాక్టీసు చేసుకో. నాలుగు డబ్బులన్నా వస్తాయి" అంటూ తనతో మెడిసిన్ చదివిన ఒకమ్మాయి జెంగ్‌ని, తరచూ హేళన చేసేది. తిరస్కారాలు, వెక్కిరింతలు, హేళనలే జెంగ్‌లో పట్టుదల, విశ్వాసం పెంచాయి.

జెంగ్‌కి ప్రభుత్వమే మళ్ళీ ఒక ప్రత్యేక కోచ్‌ని నియమించింది. ఆ కోచ్ తర్ఫీదులో జెంగ్ ఈతలో రాటు దేలింది. మొదట చిన్న, చిన్న పోటీలలో పాల్గొని మెడల్సు సంపాదించడం ప్రారంభించింది.

జెంగ్ నైపుణ్యత చూసిన ప్రభుత్వం, ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేసి, మంచి ఆహారం అందించి బాగా ప్రోత్సాహించింది.

జెంగ్ జీవితంలో అనుకోని, అద్భుతమైన మలుపు వచ్చింది. జెంగ్ పారా ఒలింపిక్స్‌కి చైనా జట్టు తరఫున ఎంపిక చేయబడింది. పారా ఒలింపిక్స్‌లో అనేక మెడల్స్ సాధించింది.

జెంగ్ ప్రదర్శన చూసి క్రీడా ప్రపంచం అబ్బురపడింది. జెంగ్ ఒక ప్రముఖ భారతీయ సినిమా కవి రాసిన ఈ పాటి విని ఉండదు. కానీ విచిత్రంగా విన్నట్టుగా పూర్తిగా ఆచరించింది.

"ఆరాటం ముందు ఆటంకం ఎంత? సంకల్పం ముందు వైకల్యం ఎంత? నమ్మకమూ, పట్టుదలలే నా రెక్కలుగా మలచి పాదాలనే పిడికిలిగా మలచి, గుండెనే గుప్పెడుగా మార్చి....."

చైనా దేశంలో ఆమె జీవితంపై, ఆమె ఘన విజయాలపై ఒక చలన చిత్రం తీసారు. ఆ చిత్రం ఎంతో మంది దివ్యాంగులకి స్ఫూర్తినిచ్చింది. వారిని జీవితంలో నిరాశ, నిస్పృహలకి గురి కాకుండా కాపాడింది. జీవితంలో కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. వారి జీవితాలని బాగు చేసింది.

జెంగ్ ఎన్నో ఘన విజయాలు సాధించిన ఒక దివ్యాంగ స్త్రీ. తన తోటి దివ్యాంగులకి ఉత్సాహం, స్ఫూర్తి ఇచ్చిన ధీర వనిత.

---

**(18వ పేజీ తరువాయి...)**

## విమాన ప్రయాణం..

కిటికీ పక్కన సీటు లభిస్తే ఆకాశ అందాలను/మేఘాలపై తేలిపోతున్నట్లుగా అనుభూతులను ఆస్వాదిస్తూ, ముఖ్యంగా విమానం టేకాఫ్ లేదా ల్యాండింగ్ సమయాల్లో ప్రకృతి అందాలను చూస్తూ మానసిక ఆనందాన్ని పొందవచ్చు. గంటల పాటు ప్రయాణంలో తప్పనిసరిగా మధ్య మధ్య నీరు తాగడం మరువవద్దు. చెవుల్లో దూది లేదా ఇయర్ ఫోన్స్ పెట్టుకొని ప్రశాంతంగా నిద్రకు పోవడానికి లేదా నాణ్యమైన విశ్రాంతి తీసుకోవడానికి తగిన సమయం ఇవ్వండి. ప్రయాణ సమయంలో వదులుగా ఉన్న లేదా కంఫర్ట్ ఫిట్ వస్త్రాలు కట్టుకోవడం, తేలికైన షూ లేదా పాదరక్షలు వేసుకోవడం మంచిది. విమానంలో అందించే ఆల్కహాల్ సేవనం తక్కువగా చేయండి.

సమయం చాలా విలువైనది. సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ఒ కళ. సమయాన్ని వ్యర్థం చేస్తే సంపదను కోల్పోయినట్లే. అందుకే కదా 'టైమ్ ఈజ్ మనీ' అంటాం. కాబట్టి అధిక గంటలు విమాన ప్రయాణాలు చేస్తున్న వారు ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, ప్రయాణాన్ని ఆనంద/విజ్ఞాన/వినోదమయం చేసుకోవడానికి ప్రయత్నాలు చేద్దాం. అందివచ్చిన అవకాశాలను మనకు అనుకూలంగా మార్చుకుందాం.

మనం ఇలాంటి ప్రయాణాలు చేయవలసి వస్తే వినోద, విజ్ఞాన, విశ్రాంతి, ఆరోగ్య సంబంధమైన విషయాలకు సమయాన్ని కేటాయిస్తూ, మన ప్రయాణాన్ని ఆనందమయం చేసుకుందాం, అద్భుతంగా నవ్వుతూ గమ్యస్థానాలను చేరుకుందాం.

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**

# ఆఫ్రికా వాసుల జీవన వృక్షం 'బోబాబ్'

ఆఫ్రికా ప్రజలకు గొప్ప వరం బాబాబ్ చెట్లు, ఆఫ్రికాలో నీటి కొరత చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ చెట్టు వల్ల వారి నీటి కొరత ఉండదు. అందుకే దీన్ని ప్రధానంగా జీవన వృక్షం అని పిలుస్తారు. ఈ చెట్టును బాయోబాబ్, బావ్‌బాబ్ బోబాబ్ చెట్లు అని పలు మాండలికాల్లో పిలుస్తుటారు.

బాబాబ్ చెట్టు శాస్త్రీయ నామం ఆడాన్సోనియా. ఈ శాస్త్రీయ నామాన్ని ఫ్రెంచ్ శాస్త్రవేత్త మైకెల్ అడాన్సన్ గౌరవార్థం పెట్టారు. ఇందులో అడాన్సోనియా డిజిటేటా (Adansonia digitata) (ఆఫ్రికన్ బోబాబ్) అత్యంత సాధారణమైనది. ఇంకా అనేక ప్రత్యేక శాస్త్రీయ నామాలను ఈ చెట్టు కలిగివుండటం విశేషం.

ఈ చెట్టు మాల్వేసి కుటుంబానికి చెందినది. బాబాబ్ చెట్లల్లో 8 జాతులు ఉన్నాయి. వీటిలో ఆరు జాతులు ఆఫ్రికానందు మడగాస్కర్‌లోని మొరోండవా సమీపంలో ఉండగా, మరో జాతి ఆస్ట్రేలియాలోను, ఇంకో జాతి ఆఫ్రికా ప్రధాన భూభాగంలో ఎక్కువగా కనిపిస్తాయి. ఎండా కాలంలో ఈ చెట్టు కొమ్మలు వేర్ల ఆకారంలో కనిపిస్తాయి. ఆ కారణంగా ఆస్ట్రేలియాలో దీన్ని తల్లక్రిందలి చెట్టు అని పిలుస్తుంటారు. ఆఫ్రికన్ జానపద కథల్లో బాబామ్ చెట్టుకు విశేష స్థానం ఉంది. కొంతమంది దాన్ని దేవతల నివాసంగా భావిస్తారు. ఆ కారణంగా ఈ చెట్టును ఆఫ్రికా ప్రజలు పవిత్ర వృక్షంగా భావించి పూజిస్తారు. గ్రామాల మధ్యలో బాబాబ్ చెట్టు చుట్టూ సమావేశాలు, పండుగలు, న్యాయ పంచాయితీలు జరుగుతాయి. ఇది "ఆఫ్రికన్ గ్రామ హృదయం"గా భావిస్తారు. సూర్యోదయ సమయంలో, సూర్యాస్తమయం సమీపంలో మడగాస్కర్‌లోని మొరోండవ సమీపంలో అత్యధిక బాబాబ్ చెట్లు ఉన్న ప్రదేశాన్ని తిలకించడమనేది మరువలేని మధురానుభూతి అని చెప్పవచ్చు. ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించడానికి పర్యాటకులు ఆ సమయంలో హెచ్చుగా వస్తుంటారు.



## అతి ప్రాచీనమైన ఎత్తైన చెట్టు

బాబామ్ చెట్టు ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలలో ఎక్కువగా కనిపిస్తాయి. ఇవి 5 నుండి 30 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతాయి. కొన్ని చెట్లు 50 మీటర్ల ఎత్తు వరకు కూడా పెరగటం విశేషం. చుట్టుకొలత మాత్రం 35 మీటర్లు దాటి ఉంటుంది. ఇంత ఎత్తుకు ఇవి పెరగడానికి కనీసం 30 సంవత్సరాల కాలం పడుతుంది. ప్రపంచంలోనే ఇవి ఎత్తైన చెట్లు అనేది ఒక విశేషమైతే, సుమారు వెయ్యి సంవత్సరాల నుండి ఆరు వేల సంవత్సరాల కాలం వరకు బతుకుతాయనేది అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసే మరో విశేషం. ప్రస్తుతం 3 వేల సంవత్సరాల నుండి ఉన్న అతి పెద్ద బాబాబ్ చెట్లు జింబాబ్వేలో ఉంది. డైనోసర్ల కాలం నుండి ఈ చెట్లు భూమిపై ఉన్నాయని చరిత్ర చెబుతోంది. ఆఫ్రికాలో వేసవి కాలం ఆరునెలల పాటు ఉంటుంది. అక్కడి గిరిజనులు నీటికోసం చాలా ఇబ్బందులు పడుతుంటారు. ఆ సమయంలో బాబాబ్ చెట్లు వారి దాహాన్ని తీరుస్తున్నాయి. ఈ చెట్టు తమ కాండంలో ఒక లక్షా 20 వేల లీటర్ల నీటిని భద్రపరచుకుంటుంది. ఆ నీరు చాలా స్వచ్ఛంగా ఉంటుంది. ఆ కారణంగా ఆఫ్రికాకు చెందిన గిరిజనులు వీటిని నేరుగా తాగుతారు. బాబాబ్ చెట్టు అత్యంత ప్రధాన లక్షణం ఇంత నీటిని తన మొదలులో దాచుకునే సామర్థ్యం కలిగివుండటమే. వర్షపాతం చాలా తక్కువగా ఉండి, నీటి కొరత హెచ్చుగా ఉండే శుష్క ప్రాంతాలలో జీవించడానికి అనుగుణంగా ఈ చెట్టు తన కాండంలో పెద్ద మొత్తంలో నీటిని నిల్వ చేస్తుంది. ఒక పెద్ద బాబాబ్ చెట్టు తన కాండంలో ఒక లక్షా 20 వేల లీటర్ల నీటిని నిల్వ చేయగలదు. ఈ నీరు వేసవి కాలంలో చెట్టు జీవనాధారంగా ఉపయోగపడుతుంది. స్థానికులకు నీటి వనరుగా కూడా పనిచేస్తుంది.

వర్షాకాలంలో ఈ చెట్టు స్పాంజి లాంటి కాండం నీటిని గ్రహిస్తుంది. ఆ నీరు వేసవికాలంలో ఉపయోగించబడుతుంది. ఆఫ్రికా ప్రజలు ఈ చెట్లనే ఇళ్లుగా చేసుకుంటారు. ఏనుగులకు దాహం వేసినప్పుడు వాటి దంతాలతో ఈ చెట్టుకు కన్నం వేసి నీటిని తాగుతాయి.

## ఔషధగుణాల చెట్టు

బాబాబ్ చెట్టుకు కాసే పండ్లు, గింజలు, ఆకులు అన్ని ఔషధ గుణాలు కలిగి వుండటంతో పలు రకాల ఔషధాలు తయారీలో వీటిని ఉపయోగిస్తారు. వీటికి రుచికరమైన ఆరోగ్యవంతమైన సిట్రస్ పండ్లు కాస్తాయి. కాయలు కాసే సమయంలో చెట్టు ఆకులన్నీ రాలిపోతాయి. బాబాబ్ పండులో విటమిన్ సి, బి2, కాల్షియం, టార్టారిక్ అమ్లం, యాంటీ అక్సిడెంట్స్ సమృద్ధిగా ఉంటాయి. బాబాబ్ పండును మంకీ బ్రెడ్ అని కూడా పిలుస్తారు. ఇది అమ్ల రుచిని కలిగి ఉంటుంది. దీన్ని పొడి చేసి ఆహారంతో పాటు పానీయాలలో కలిపి సేవిస్తారు. దీన్ని వంటకాలలో, సౌందర్య ఉత్పత్తులలో ఉపయోగిస్తారు. ఈ పండు బాగా పండిన పిదప తింటే చాలాసేపు వరకు ఆకలి వేయదు. ఇక కడుపులోని సమస్యలకు, కీళ్ల వ్యాధులకు బాబాబ్ చెట్టు విత్తనాలనే వాడతారు. చెట్టు బెరడును స్ట్రోఫాంథస్ విషానికి నివారిణిగా భావిస్తారు. ఆఫ్రికాలో దీని గుజ్జును దయేరియాను నయం చేయడానికి, జ్వరాలకు చికిత్స చేయడానికి డయాఫొరేటిక్ తరచుగా ఉపయోగిస్తారు. గాయాలను శుభ్రపరచడానికి, బెరడు గమ్‌ను వాడతారు. ఈ చెట్టు వర్షాకాలం నుండి నీటిని దాని భారీ కాండంలో గ్రహించి నిల్వ చేస్తుంది. ఎండా కాలంలో పోషక సాంద్రత కలిగిన పండ్లను ఉత్పత్తి చేస్తుంది. బాబాబ్ పండు ఒక అడుగు పొడవు వరకు పెరుగుతుంది. దీని పుష్పాలు రాత్రి పూట వికసిస్తాయి. తెల్లగా, పెద్దగా ఉంటాయి. గబ్బిలాల ద్వారా పరాగ సంపర్కం జరుగుతుంది. చెట్టు బెరడును తాడు, బుట్టలు, కాగితం, వస్త్రాల తయారీకి ఉపయోగిస్తారు. ఆకులను ఉడికించి ఆకుకూరల వలె ఆహారంగా తింటారు. ఈ చెట్టు ఆకులు యాంటి హిస్టామైన్, హైపోసెన్సిటివ్ గుణాలు కలిగి ఉంటాయి. ఇవి ఉబ్బసం, మూత్రపిండాలు, మూత్రాశయ రుగ్మతలు, అలసట, అతిసారం వంటి వాటికి చికిత్సగా పని చేస్తుంది. ఆకులు, పువ్వుల కషాయం కంటి చికాకును, కడుపులోని సమస్యలను తగ్గిస్తుంది. శ్వాసకోశ సమస్యలు కూడా దూరం అవుతాయి.

ఈ చెట్లు పొడిగా ఉండే



ప్రాంతాలలో వాటికవే పుట్టుకొని వస్తుంటాయి, పర్యావరణ పరిరక్షణలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. బాబాబ్ ఆకులు, బెరడు, పండుజ్వరం, మలేరియా, జీర్ణ సమస్యల చికిత్సకు సంప్రదాయ ఔషధాలలో ఉపయోగిస్తున్నారు. ఈ పండు గుజ్జు యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది, రోగ నిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఈ చెట్టు భాగాల ఆకులు, పండ్లు ఆహారంలో తీసుకోవడం వల్ల బరువు తగ్గుతారు. ఆకలిని మందగించేట్టుగా చేయగలిగే గుణం కలిగిన బాబాబ్ బరువు తగ్గడంలోనూ సహకరిస్తుంది. బాబాబ్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది.

## భారతదేశంలో బాబాబ్ చెట్టు

బాబాబ్ చెట్లు భారతదేశానికి ఆఫ్రికన్ వ్యాపారులు, ముఖ్యంగా అరబ్ నౌక మార్గాల ద్వారా సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం తీసుకు వచ్చినట్టు చరిత్ర చెబుతోంది. ఈ చెట్లు సముద్రతీర ప్రాంతాల్లో, పాత కోటల దగ్గర నేటికీ ఎక్కువగా కనిపించడం ఇందుకు ఆధారంగా భావిస్తారు.

మన దేశంలోని తెలంగాణలోని హైదరాబాద్ గోల్కొండ కోట, ఫతేదర్వాజా వద్ద, గోల్ఫ్ క్లబ్ సమీపంలో బాబాబ్ చెట్టు ఉంది. గుజరాత్‌లోని జునాగఢ్, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలలో బాబాబ్ చెట్లు కనిపిస్తాయి. గోల్కొండ కోటలోని బాబాబ్ చెట్టును హాథీకాఝాడ్ (ఏనుగుచెట్టు) అని పిలుస్తారు. ఈ చెట్టు సుమారు 500 సంవత్సరాల నాటిదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది ఆఫ్రికా ఖండానికి చెందిన చెట్టు. గోల్కొండలో ఇది ఎలా వచ్చిందనే విషయమై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. గుజరాత్ మండవా ప్రాంతంలో కొన్ని బాబాబ్ చెట్లు ఉన్నాయి. మహారాష్ట్ర లోని ఔరంగాబాద్, నాసిక్ ప్రాంతాలలో పాత బాబాబ్ చెట్లు కనబడుతాయి. మధ్యప్రదేశలోని భోపాల్, సాగర్ ప్రాంతాలలో కూడా పలు చెట్లు ఉన్నాయి.

## బాబాబ్ చెట్టు ఎదుర్కొంటున్న సమస్యలు

వాతావరణ మార్పు బాబాబ్ చెట్ల ఎదుగుదలకు అవరోధంగా మారింది. శుష్క ప్రాంతాలలో వర్షపాతం తగ్గడం వల్ల బాబాబ్ చెట్ల పెరుగుదల, జీవనాధారం సమస్యగా మారింది. వ్యవసాయం, నగరీకరణలో భాగంగా అటవీ నిర్మూలనల కారణంగా బాబాబ్ చెట్ల సంఖ్య తగ్గుతోంది. బాబాబ్ పండు, నూనె ఇత్యాది వాటికి పెరిగిన డిమాండ్ కారణంగా అధిక సేకరణ జరుగుతోంది. దాంతో వాణిజ్య దోపిడీ పెరిగింది. ఆ కారణంగా స్థానిక జనాభాపై ఒత్తిడి పెరిగింది. ఏది ఏమైనా బాబాబ్ చెట్లను పరిరక్షించుకోవడానికి ఆఫ్రికా ప్రజలు, ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు.

– షేక్ అబ్దుల్ హాకీం జాని

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్: 9885446501/9885449458



# వీధిపోట్లు చెడు ఫలితాలే ఇస్తాయా?

**ఎస్.మంజూష, నిడదవోలు**

**ప్రశ్న: వీధిపోట్ల గురించి చాలా వింటున్నాం. వీధిచూపులు అని కూడా కొందరంటారు. వీధిపోట్లు తప్పకుండా చెడు ఫలితాలనే ఇస్తాయా? మంచి ఫలితాలను అసలు ఇవ్వవా? వీధిపోట్లు కూడా బాగున్నవాళ్లెంతో మంది ఉన్నారు కదా!**

**జవాబు:** వీధిపోట్లు అనేక రకాలుగా ఉంటాయి. ఎంత పెద్ద నిర్మాణాలైనా సరే వీధిపోటు, వీధిచూపు ప్రభావానికి లోనుకావలసిందే. అనేక వీధిపోట్లు చెడు ఫలితాలనిస్తాయి.

కొన్ని పోట్లు (చూపులు) చాలా మంచి ఫలితాలనిస్తాయి. 'చెడు' ఫలితాలనిచ్చే వాటిని 'వీధిపోట్లు'గాను, 'మంచి' ఫలితాలనిచ్చే వాటిని 'వీధిచూపులు'గాను పేర్కొన్నారు. నైసర్గికంగా క్షేత్రాలను బయట నుంచి తగిలే ఈ వీధిపోట్లు, వీధిచూపుల తీవ్రత అంటే- చెడు, మంచి ఫలితాల క్రమం ఆయా వీధుల స్వరూప, స్వభావాలను బట్టి హెచ్చుతగ్గులుగా ఉంటుంది. చెడు ఫలితాలనిచ్చే 'వీధిపోట్ల' వలన పతనమైన గృహస్తులెందరో ఉన్నారు. అలాగే మంచి ఫలితాలనిచ్చే 'వీధిచూపుల' వలన అభివృద్ధి పొందుతున్నవాళ్లు కూడా ఉన్నారు.

## ఈశాన్యం పెరిగినా మంచి ఫలితాలు?

**కె.శ్రీనివాసన్, పుత్తూరు**

**ప్రశ్న: ఈశాన్యం పెరిగి ఉంటే మంచిదని వాస్తు పుస్తకాల్లో ఉన్నది. మా ఇంటి ఖాళీ స్థలంలో తూర్పు, ఉత్తర ఈశాన్యాలు పెరిగి వున్నాయి. కానీ మాకు ఈ ఇంట్లో మంచి ఫలితాలు కనిపించటం లేదు. ఎందువల్ల?**

**జవాబు:** ఈశాన్యం పెరగటం వల్ల తప్పకుండా మంచి ఫలితాలు పొందవచ్చు. గృహ నిరాన్మంలో, క్షేత్రంలో మిగతా అన్ని విషయాలు, దోషాలు లేకుండా ఈశాన్యం పెరిగి వుంటే తప్పకుండా మంచి ఫలితాలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో అంతా బాగుండి కూడా పెరిగిన ఈశాన్య స్థలంలో పేడకుప్పలు, చెప్పులు, కర్రలు, ఆయుధాలు, పనిముట్లు, తోళ్లు, మలమూత్ర విసర్జనా వ్యర్థాలు (పశువుల పెంపకం సందర్భాల్లో) మొదలైనవి ఉన్నప్పుడు మంచి ఫలితాలను ఆశించలేం.

ఈశాన్యం ఈశ్వరుడి చోటుగా చెప్పబడింది. ఆ స్థలాన్ని పవిత్రమైనదిగా చూసుకోవాలి. బరువులు పెట్టకూడదు. నీటివాటం అటు అటు వుండేలా పల్లాన్ని సవరించుకోవాలి. ఇంటిలోపల అశుయతే నడకకూ, పూజకూ ప్రాధాన్యతనివ్వాలి. మీ విషయానికి వస్తే- మీ ఇంటికి/స్థలానికి ఈశాన్యం పెరిగి ఉన్నప్పుడు మీకు నిజంగా చక్కటి ఫలితాలు రావాలి. కానీ పైన పేర్కొన్న విధంగా ఆ స్థలాన్ని మీరు దోషాపూరితం గావించారేమో ఒక్కసారి పరిశీలించి చూడండి. ఈశాన్యంలో ఉండకూడనివేవైనా ఉంటే వాటిని అక్కడి నుండి తీసేయండి. ఇటువంటి దోషాలను తొలగించడం వల్ల ఈశాన్యమూల చాలా వేగవంతంగా సత్ఫలితాలను అందిస్తుంది. ■



వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు.
ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే,
రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ..............................................
పుట్టిన తేది : ..............................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .................
చిరునామా:..................................................

**– ఉదార స్వభావం ఉన్నవారే ఉత్తములు, సహృదయులు.**
**– ఉత్తమ ఉపాధ్యాయుడు కూడా ఒకప్పుడు విద్యార్థే.**
**– అద్భుతాలు సృష్టించేవాడు కూడా మనిషే. అద్భుతాలు పైనించి ఊడిపడవు.**

## శిశిరాలు

అక్కడ
వడలిపోయిన చెట్టుదేహం
పెడుచులుగా ఊడిపోతున్న బెరడులు
రాలిపోతున్న ఆకులు
వాటిలోని ఎముకలగూడు
జీర్ణించుకుపోయే
పుడమిలో
ఇది ప్రకృతిసృష్టి..
కానీ..!
ఈ వ్యవస్థ ఆకృతి
చూడు
ముడత పడిన
శరీరాలు
రాలిపోతున్న త్మలు
కాముకుల కూడు
కల్లు కుళ్లు చూపు
ఇది ప్రజల సృష్టి
ఇవి ప్రకృతి ప్రజల
శిశిరాలు..



– తమ్మా రాజా

## కోరికల్లేకపోతే...!

సాగదు ముందుకు జీవితం
కోరికలన్నవి లేకపోతే!

కోరికలు నెరవేరకపోతే
కొనసాగును మనిషి బతుకు
నిస్సారంగా! నిర్వేదంగా!

కోరికలు నెరవేరాలంటే...
కృషి, పట్టుదలతో పాటు
సంకల్పబలం కూడా ఉండాలి!

ఉండకూడదు కోరికలు అనంతంగా!
ఉండాలి కోరికలు మితంగా!
కోరికలు గుర్రాలు కాకూడదు

కోరికలు హంసలు కావాలి
అప్పుడే జీవితం
ఉంటుంది సుఖసంతోషాలతో!
జీవితం అన్నదే ఒక కోరిక
అందులో జీవించాలి గానీ,
అదే జీవితం కాకూడదు!

– సి.రాజశేఖర్

# ఈ వారం కవిత్వం

## ఒంటరి చెట్టు

వేదన పవనాలు ముఖం మీద
ఎడతెగక వీస్తున్నాయి.
దిగులు సంద్రాలు ముంచుతున్నాయి
మనసులో తుపానులు
రేగుతున్నాయి.

ఎన్ని వసంతాలు నడచినా
ఎన్ని ఆనందాలు పూసినా
ఇప్పటి జీవితంలో
మోనాలు అల్లుకున్నాయి
దుఃఖాలు కన్నీటిని వొంపుకున్నాయి

జీవితం ఒక ఎడతెగని పయనం
ఎన్నెన్నో పరిచయాలు ముగింపులు
ఎన్నో కలవడ్డ కలలు
ఎన్నో కన్నీటి పడవలు
అన్నీ అనుభవాలే.
అయినా
ఒంటరి చెట్టు చలించదు.

రాళ్ళ మధ్య ఒద్దికగా ఎదుగుతుంది.
వానలో తడుస్తూ
కాంతి కిరణాల్ని ఆస్వాదిస్తూ
అనుభవ జ్ఞాపకాల్ని మోస్తూ
ఎదుగుతూనే ఉంటుంది.

– గవిడి శ్రీనివాస్

## ఆప్యాయత

ఆప్యాయత..
అనురాగాల
కలబోత మా
పల్లెటూరు
అమలిన జీవన
విధానం
సంస్కృతి
సంప్రదాయాల
కూడలి
చెమటనీరుల ఏరు
పల్లె యాస భలే
జోరు
పచ్చ పచ్చని పైర్లు
గల గల జల
ప్రవాహాలు
కల్లాకపటం లేని బోలాతనం
పిల్లల హుషారు
కన్న వాళ్ళ కేరింతలు
కావాల్సిన వాళ్ళ కౌగిలింతలు



మోసం, అమర్యాద కనం మనం
నోరారా వరుసులతో పిలుపులు
కడుపునిండా తిండి
కంటినిండా నిద్ర
చేయారా పని
కాలుష్యం చొరబడని
పల్లె ముఖం
పడుచు నుదుటి తిలకం

మసకబారని మా'నవ'సంబంధాలు
కమ్మ కమ్మని కబుర్లు
ఉల్లాసంతో కూడిన ఊసులు
ఉమ్మడి కుటుంబాలు
విలువలతో కూడిన విద్యలు
చేయి చేయి కలయిక
పరస్పర సహకారం

– రాళ్లబండి సంగం నాయుడు

# మళ్ళీ గ్రంథాలయోద్యమం!

పురాతత్వ శిలాశాసనాలు, తాళపత్రాలు, తామ్రపత్రాలు ప్రాచీన సంస్కృతి భాషా వైభవాన్ని భవిష్యతరాలకు అందించే నిక్షిప్త చారిత్రక మహోన్నతకు ప్రతీకలు. ఉలితో శిలపై చెక్కించి తమ పాలనా ప్రాభవాన్ని, శతాబ్దాల కాలగర్భంలోని ఆధ్యాత్మిక, నైతిక, సామాజిక అంశాలను, ప్రజలకు తెలియచేసేటట్లు సృష్టించబడిన ప్రాచీన విలువల సంక్షిప్త సారాంశం, ఆధునిక యుగ పరిభ్రమణంలో గ్రంథస్థంగా ఆవిర్భవించింది.

అమూల్యమైన వస్తు విశేషాలను పదిలపరచుకొనే భాండాగారం, ఒకానొక కాలంలో క్రిమికీటకాదుల బారిన పడకుండా తాళ, తామ్రపత్రాలు క్రమేపీ పుస్తక భాండాగారాలు, ఆధునిక యుగంలో గ్రంథాలయాలుగా అవతరించాయి. బ్రిటిష్ పాలనా కాలంలో దేశంలో అడుగు పెట్టిన ముద్రణా సౌకర్యం, ప్రచురణల రూపంలో గ్రంథాలు, పుస్తకాలు పదిలపరుచుకొనే ఆలయ పవిత్రత గ్రంథాలయాలకు సమకూరింది. తెలుగునాట సంస్కృతి, భాష పునరుజ్జీవానికి ఆర్థిక, రాజకీయ, సామాజిక చరిత్ర పునరుత్తేజానికి స్వాతంత్ర్యోద్యమ నేతలు తమ ఆశయ సాధనకు, స్వాతంత్ర్య పోరాట దీప్తి రగిలించటానికి పత్రికలు, ప్రచురణల సాహిత్యం ఆయుధంగా చేపట్టారు. తొలి దశలో పత్రికల ప్రాచుర్య ప్రాధాన్యత, పుస్తకాల ప్రచురణ వెల్లివిరిసి భాషా నిలయాలు, గ్రంథాలయాలుగా రూపుదిద్దుకున్నాయి. బ్రిటిష్ పాలనను పారద్రోలే శాంతియుత పోరాటాలలో అంతర్భాగంగా గ్రంథాలయోద్యమం అంకురించింది. నిరంకుశ బ్రిటిష్ పాలనను ప్రతిఘటించే చైతన్య స్ఫూర్తికి పత్రికలు, గ్రంథాలు కరదీపికలయ్యాయి. గ్రంథమాలలు దేశాభివృద్ధికి, భాషాభివృద్ధికి, జ్ఞానాభివృద్ధికి, దురాచార నిర్మూలనకు క్రమేపీ స్వాతంత్ర్య ఉత్తేజానికి వైతాళిక బాధ్యత చేపట్టాయి. వందేమాతరం ఉద్యమ కాలంనాటికి,



తెలుగునాట ఆంధ్రోద్యమంలో అంతర్భాగంగా క్రమేపీ గ్రంథాలయోద్యమం వెల్లివిరిసింది. 1901లో శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం, ఆంధ్ర సరస్వతీ నిలయం, వీరేశలింగం కంఠాభరణ గ్రంథమాల 1924లో సంస్కారిణీ గ్రంథమాల, తెలుగునాట ఆంధ్ర, తెలంగాణ రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలలోని ప్రముఖ విద్యావేత్తలైన సమరయోధులు ఊరూరా, గ్రామాలలో సంచరించి గ్రంథాలయాలు నెలకొల్పారు. తెలంగాణలో గ్రంథాలయోద్యమ ప్రభావంతో, నైజాం పాలనా కాలంలో ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దే ఉద్యమాలు వైతాళిక నేతలు చేపట్టారు. గ్రంథమాల తరపున ప్రచురించిన పుస్తకాల సంచి భుజాన వేసుకొని కష్ట నష్టాలతో, సంచరించిన సాహితీవేత్తలలో వట్టికోట ఆళ్వార్‌స్వామి ప్రముఖులు.

తెలంగాణ సీమకు సంబంధించి నిజాం నిరంకుశ పాలన, దొరల అరాచకాలు, పీడిత ప్రజల పక్షాన గ్రామీణ పేద రైతాంగం ఆశలను, ఆకాంక్షలను ప్రతిబింబింపచేసి, భూస్వామ్య వ్యవస్థను కూలదోసే జనస్వామ్య పాలనా వ్యవస్థను నెలకొల్పిన చారిత్రక నేపథ్యంలో గ్రంథాయోద్యమ నేతల పాత్ర ఎంతో వుంది. తెలుగు చదవడం, రాయడం నేర్చుకొనే ప్రజా చైతన్యం గ్రంథాలయోద్యమంగా అగ్రేసర సాహితీ మూర్తుల లక్ష్యమైంది. దాశరథి, రావిచెట్టు, కొమర్రాజు, సురవరం, మాడపాటి, కాళోజీ, లోకనంది, బూర్గుల, పులిజాల, గడియారం, దేవులపల్లి, కొండా, షబ్నవీస్, కోదాటి నారాయణరావు యింకా ఎందరో మహనీయులు ప్రత్యక్షంగా/పరోక్షంగా తెలంగాణలో గ్రంథాలయ వికాసానికి అవిరళ సేవలందించారు.

ప్రథమ గ్రంథాలయ మహాసభకు మధిరలో 1925లో పింగళి వేంకట రామారెడ్డి అధ్యక్షత వహించారు. నైజాం పాలనలో మాతృభాషకు సంకెళ్లు పడిన రోజులలో, గ్రంథాలయాల స్థాపనకు అనుమతుల ఆంక్షలు విధించబడిన రోజులలో కూడా తెలంగాణా ఉద్యమ నాయకులు, సాహితీవేత్తలు, ఆంధ్ర ప్రాంత గ్రంథాలయ ఉద్యమ స్ఫూర్తితో ముందడుగు వేసారు. తెలుగు సమాజ సాంస్కృతిక, సాహితీ రంగాలకు, సర్వతోముఖాభివృద్ధికి బహుముఖ ప్రజ్ఞాశాలిగా, గోల్కొండ పత్రికా సంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి కొంగ్రొత్త వెలుగులు ప్రసరింపచేసారు.

తెలుగునాట బ్రిటిష్‌దొరల పాలనా కాలంలోనే రాజమహేంద్రవరంలో 1853 ప్రభుత్వ కళాశాలలో గ్రంథాలయం ప్రారంభించబడింది. 1800 సంవత్సరంలో ప్రచురింపబడిన విలువైన గ్రంథాలున్నాయి. 1898లో గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయం స్థాపించబడింది.



1914లో సర్వజన పుస్తక భాండాగారంగా పిలవబడి, 1920 నాటికి రిజిష్టరు చేయబడి, 1979 నుంచి ప్రభుత్వ గ్రంథాలయంగా సేవలందిస్తోంది. తాళపత్ర గ్రంథాలు కూడా ఉండేవి.

అదేవిధంగా చీరాల సమీపంలోని వేటపాలెం గ్రంథాలయం కూడా అత్యంత ప్రాచీనమైనది. ప్రైవేట్ యాజమాన్యంలో ట్రస్ట్‌లు నిర్వహించే గ్రంథాలయాలు విరివిగా, ప్రతీ పట్టణంలో ఉన్నాయి. విశ్వవిద్యాలయాలలో, కళాశాలలలో ఎన్నో గ్రంథాలయాలు, ప్రస్తుతం పల్లెలలో, పట్టణాలలో వున్న గ్రంథాలయాలు నిరాదరణకు గురి అవుతున్నాయి. ప్రభుత్వ పరంగా శాఖా గ్రంథాలయాలు మిణుకుమిణుకు అంటున్నాయి. జిల్లా గ్రంథాలయ సంస్థల ద్వారా పుస్తకాల కొనుగోలు అంతంత మాత్రంగా సాగుతోంది. తెలుగునాట గ్రంథాలయ ఉద్యమ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య వంటి మహనీయులను స్మరించేవారే లేరు.



అయినా రచయితలకు, కవులకు రచనల పట్ల ఆసక్తి ఉండటంతో వివిధ పత్రికలలో పుస్తకాలు వస్తున్నాయి. మహిళలు, మధ్య, పెద్ద వయస్కులే పుస్తకాలను కొంత ఆదరిస్తున్నారు. పిల్లలకు మాతృభాష కనీసం చదవటం, రాయటం నేర్పడం పట్ల విద్యాధికులైన తల్లిదండ్రులకు కూడా ఆసక్తి లేదు. పుస్తకాలు చదవటం తగ్గిపోవటంతో, గ్రంథాలయాలు బావురుమంటున్నాయి.

ఎన్.టి.ఆర్. ముఖ్యమంత్రిగా ఉండగా, గ్రంథాలయాలను సాంస్కృతిక కేంద్రాలుగా రూపొందింపచేయాలనే ప్రయత్నం సఫలం కాలేదు. బాలలు, మహిళలు, వృద్ధులు, టీవీలు, కంప్యూటర్‌లు, సెల్‌ఫోన్‌ల వినియోగం తగ్గించి పుస్తక పఠనం ఉత్సాహంగా కొనసాగించేటట్లు పట్టణాలు, నగరాలలోని స్వచ్ఛంద సేవా సంస్థలు కార్యక్రమాలు చేపట్టేటట్లు ప్రభుత్వ ప్రోత్సాహం అందించాలి. బాలసాహిత్యం తరగతి గదులలోకి ప్రవేశింపచేయాలి. పాఠశాలలలో లైబ్రరీ పీరియడ్ ఉండాలి. ప్రముఖ రచయితలు, కవులను ఆహ్వానించి విద్యార్థులతో చర్చలు, ప్రసంగాలు, ముఖాముఖీలు ఏర్పాటు చేయాలి. మొక్కుబడి వ్యవహారాలుగా కాకుండా చిత్తశుద్ధితో ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి.

రెండు తెలుగు రాష్ట్రాలలో గ్రంథాలయాల స్థితిగతులు యించుమించు ఒక్కలానే ఉన్నాయి. రచయితల మేధా సంపద గ్రంథాల రూపంలో బీరువాలలో నిక్షిప్తమై ఉంది. గ్రంథాలయ వారోత్సవాల ప్రాధాన్యత తగ్గిపోయి విశాల భవన ప్రాంగణాలు నిస్తేజం అవుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలతో, స్థానిక సంస్థల పాలనాధికారులతో గ్రంథాలయాల అనుసంధానం, గ్రంథాలయ సెస్ సద్వినియోగం సక్రమంగా నిర్వర్తించాలి. వైద్యాలయం, విద్యాలయం, దేవాలయం మూతపడవు. గ్రంథాలయానికి ఈ దుస్థితి ఎందుకు?

**– జయసూర్య**


## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

sunmagvaartha@gmail.com

## 9 నవంబరు, 2025 నుండి 15 నవంబరు, 2025 వరకు



# వారఫలం

**శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు**

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు, గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1

ఫోన్ : 98494 53449, 9440927795

### మేషం

ఈ వారం కోర్టు వ్యవహారాధి తీర్పులు వాయిదాల రూపంలో ఉంటాయి. కొంతమంది పట్ల కోపంతో ఉంటారు. నూతన కార్యక్రమాలను ప్రారంభిస్తారు స్నేహితులు అండదండగా నిలుస్తారు. సొంత కాళ్ళ మీద నిలబడే ప్రయత్నాలు బాగుంటాయి. వ్యాపారాలు ఆదాయము బాగుంటాయి. లక్ష్మీ తామరవత్తులతో అష్టమూలిక తైలంతో దీపారాధన చేయండి. దైవ చింతన కలిగి ఉంటారు.

### వృషభం

ఈ వారం చిన్న చిన్న అనారోగ్య సమస్యలతో సతమతమయ్యే అవకాశం ఉంది. లంగ్స్ ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్యాలు లివర్కు సంబంధించిన అనారోగ్యాలు వాటికి అవకాశం ఉంది నిర్లక్ష్యం చేయొద్దు. జిల్లేడు వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి ఆటంకాలన్నీ తొలగిపోతాయి. ఎంతోకాలంగా మీరు ఎదురుచూస్తున్న ఒక శుభవార్తను వినగలుగుతారు.

### మిథునం

ఈ వారం పోటీ పరీక్షల్లో పాల్గొంటారు. ఉన్నత విద్య వైద్య విద్య ప్రభుత్వ ఉద్యోగం కోసం రాసే పరీక్షల్లో విజయం సాధిస్తారు. పరపతి పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు స్నేహాలుగా మారుతాయి. లీజులు లైసెన్సులు కాంట్రాక్టుల కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఉద్యోగంలో మార్పులు ఏర్పడతాయి. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అర్చన జరిపించండి.

### కర్కాటకం

ఈ వారం శత్రువులు శత్రు ముఖ పరిచయాలు ఏర్పడతాయి అనివార్య సందర్భాలలో తిరస్కరిష్కరించలేని పరిస్థితులు సంభవిస్తాయి. అనారోగ్య సమస్యలు పెరగడం, రక్త పరీక్షలకు ధనం ఖర్చయ్యే విధంగా పరిస్థితులు గోచరిస్తున్నాయి. వాతావరణంలో వచ్చే మార్పుల ప్రభావం జీర్ణకోశ వ్యాధి సంబంధిత అనారోగ్యాలు ఏర్పడతాయి. అరటినార వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన జరిపించండి.

### సింహం

ఈ వారం విదేశాలలో వ్యాపార నిమిత్తం పెట్టుబడులు పెట్టాలని ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. విదేశీ ప్రయాణాలు వ్యవహారాలు అనుకూలిస్తాయి. సర్వ రక్ష చూర్ణము సర్పదోష నివారణ చూర్ణము కలిపి స్నానమాచరించండి. వివాహ సంబంధాలు కుదరట్లేదు అయిన వాళ్లతో కలహాలే వీటికి కారణం అన్న నిమిత్తం పరిస్థితులు ఉంటాయి.

### కన్య

ఈ వారం నూతన వస్తువులు వస్త్రాలు కొనుగోలు చేస్తారు. ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా గాని రాజకీయాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. కొన్ని పదవుల కోసం ప్రయత్నం చేయాలని భావిస్తారు. కొత్తగా పరిచయమైన వ్యక్తులకు ఇట్టి విషయాలను తెలియనివ్వవద్దు.

### తుల

ఈ వారం సంతాన ప్రవర్తనలో వస్తున్న మార్పులను గమనించి, వాళ్ళ భవిష్యత్తు కోసం మంచి నిర్ణయాలను వెనువెంటనే తీసుకోగలుగుతారు. రుణ బాధల నుండి బయటపడడానికి ఎంతగానో శ్రమిస్తారు. శ్రీ లక్ష్మి చందనంతో సుబ్రమణ్యస్వామి వారికి అభిషేకం జరిపించండి. కొంతమంది వ్యక్తుల ప్రవర్తన మీకు నచ్చక కొన్ని నిర్ణయాలను వెనువెంటనే తీసుకుంటారు. దూరప్రాంత ప్రయాణాలు కలిసి వస్తాయి.

### వృశ్చికం

ఈ వారం నూతన వ్యాపారాలు పట్ల ఆకర్షితులవుతారు. దైవ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. లాటరీలు ఇతర షార్ట్ టర్మ్ లో ధనం కోసం చేసే ప్రయత్నాలు విఫలిస్తాయి. పెట్టిన పెట్టుబడులు కూడా నష్టపోతారు. శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమాన్ సింధూరం తో అర్చన జరిపించి నుదుటన ఈ బొట్టును ధరించండి. శత్రువర్గం బలం పెరగడం మీలో ఆందోళనకు కారణం అవుతుంది.

### ధనస్సు

ఈ వారం దైవ దర్శనం చేసుకుంటారు. మీ పరిజ్ఞానానికి ప్రశంసలు లభిస్తాయి. కుటుంబ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. వ్యాపారానికి, ఉద్యోగానికి సంబంధించిన ఒక ఉపయోగకరమైన సమాచారాన్ని మీరు అందుకుంటారు. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. మాట తొందరపాటు మిమ్ములను ఇబ్బందులకు గురి చేసే సూచనలు ఉన్నాయి. జాగ్రత్త వహించండి. సంస్థలో మీ సహచరుల సౌజన్యంతో కలిసి కొన్ని కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

### మకరం

ఈ వారం మంచి విషయాల గురించి కాలాన్ని ఉపయోగించుకుంటారు. కాలక్షేపం చేసే వారు మీకు నచ్చారు, స్నేహితులు, సన్నిహితులు అయినా నిర్మొహమాటంగా ఇది మంచి పద్ధతి కాదు అని సలహాలు ఇస్తారు. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఫుడ్ వ్యాపారాలు, కిరాణా వ్యాపారాలు బాగుంటాయి.


### కుంభం

ఈ వారం వాహనాలు కొనుగోలు అమ్మకాల విషయాలు అనుకూలంగా ఉంటాయి. భూ సంబందిత లావాదేవీలు లాభిస్తాయి. సాఫ్ట్వేర్ రంగంలోని వారికి నూతన అవకాశాలు కలిసి వస్తాయి. సర్పదోషాలు మరియు గ్రహాల వలన కలుగు బాధలు తొలగిపోవడానికి సర్పదోష నివారణ చూర్ణం తో సర్వరక్షా చూర్ణం కలిపి స్నానం చేయండి (తలస్నానం చేయరాదు). సంతాన విద్యా విషయంలో ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తారు.

### మీనం

ఈ వారం సేల్స్ డిపార్టుమెంట్ ఉన్నవారికి అనుకూలంగా ఉంది. వ్యాపారాలలో ఆదాయం రొటేషన్‌ల రూపంలో ఉంటుంది. కొత్త దరఖాస్తులు ఉపకరిస్తాయి. ఆశిస్తున్న ప్రయోజనాలను కొద్దిగా ఆలస్యమైనప్పటికీ అందుకో గలుగుతారు. మెడలో శ్రీ మేధా దక్షిణామూర్తి డాలరు ధరించండి. ఎంతో మనోధైర్యంతో, కేవలం సంకల్ప బలంతో, కొన్ని కార్యక్రమాలను ప్రారంభిస్తారు. మంత్ర ఉపదేశం పొందాలన్న ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

# ఈ వారం కార్టూన్స్


లేటుగా వచ్చినందుకు ఏదో 'హరికథ' చెప్తారుగా..
మెడలో దండ లేకుండా చెబితే ప్రొఫెషనల్‌గా ఉండదండి!!


మొన్న భూతవైద్యుణ్ని పిలిపించి దిగ్బంధనం
చేయించినట్లున్నాను.. ఇప్పుడెలా వుంది.. నిద్ర పడుతోందా?


ఈరోజు యుద్ధం వద్దు. 'ఆప్షనల్ హాలిడే'
తీసుకుందాం అని శత్రురాజుకు చెప్పండి!!





ప్రకృతి అందాలకు నెలవైన విక్టోరియా మాహే ద్వీపంలో ఉంది. సహజ సౌందర్యానికి ఆలవాలమైన విక్టోరియాలో క్లాక్‌టవర్ మరో ప్రత్యేకత అని చెప్పుకోవచ్చు.



